ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప
జిల్లా వార్తలు
5
శుక్రవారం 27 డిసెంబరు 2024

31నే పింఛన్ల పంపిణీ

కడప కలెక్టరేట్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ప్రతి నెల 1, 2 తేదీల్లో పూర్తి చేస్తోంది. అయితే జనవరి నెలకు సంబంధించిన పింఛన్లను ఈ నెల 31వ తేదీనే పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ రోజున గ్రామాల్లో లేనివారికి జనవరి 2వతేదీ అందించేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

కూటమిది అభివృద్ధి దారి



- రూ.110.33 కోట్లతో..
- పల్లెల్లో సిమెంటు, మెటల్ రోడ్ల నిర్మాణం
- తారురోడ్లలో గుంతలకు ప్యాచ్‌లు
- జగన్ హయాంలో పల్లెల్లో మట్టిరోడ్లే గతి
- తారు రోడ్లలో గుంతలను పూడ్చని వైనం
- రోడ్లపై దృష్టి పెట్టిన కూటమి సర్కారు
- సంక్రాంతిలోపు పల్లెల్లో సిమెంటురోడ్లు కళకళ
- గోతులు లేని తారురోడ్లే లక్ష్యం

రౌండప్ 2024

(కడప-ఆంధ్రజ్యోతి): రోడ్లు నాగరికతకు చిహ్నాలంటారు. రవాణా సదుపాయం బాగుంటే పట్టణాలు, పల్లెలు అభివృద్ధి చెందుతాయి. ఇక గ్రామాల్లో మౌలిక వసతులకు కీలకమైన మట్టిరోడ్లను సిమెంటు రోడ్లుగా మారిస్తే ఆ గ్రామానికే కళ వస్తుంది. అయితే జగన్ ప్రభుత్వం రోడ్లను గాలికి వదిలేసింది. జిల్లాలో జాతీయ రహదారులను మినహాయిస్తే ఆర్అండ్‌బీ రహదారిలో వర్షాలకు పడ్డ గోతులు, వాహనాల రాకపోకలతో పడిన గుంతలకు తట్ట తారు వేసి పూడ్చలేని పరిస్థితి నెలకొంది. దీంతో పల్లెల్లో వర్షం వస్తే బురదమయం అయ్యే మట్టిరోడ్లతోనే నడక సాగించి జనం అవస్థ పడితే ఇక ఆర్అండ్‌బీ రోడ్లపై గోతుల్లోనే ప్రయాణం చేసి ఒళ్లు హూనమై వాహనాలు దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. పొరుగు రాష్ట్రాల నుంచి సంక్రాంతికి సొంత ప్రాంతాలకు వస్తే ఇక్కడ రోడ్లపై సోషల్ మీడియాలో సెటైర్స్ పడేవి. అయితే కూటమి ప్రభుత్వం రహదారులపై ప్రత్యేక ఫోకస్ పెట్టింది. పల్లె పండుగ పేరుతో గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతిలోపు సీసీరోడ్లు పూర్తి చేయాలని నిర్ణయించింది. ఇక సంక్రాంతి పండుగకు సొంతూర్లకు వచ్చేవారికి ఆర్అండ్‌బీ రహదారుల్లో గుంతలు లేని సాఫీ ప్రయాణం చేసేందుకు ప్యాచ్‌వర్క్‌లకు శ్రీకారం చుట్టింది.

జగన్‌హయాంలో రోడ్లను వదిలేస్తే కూటమి ప్రభుత్వం మాత్రం అటు పల్లెల్లో సిమెంటు రోడ్లను ఏర్పాటు చేస్తోంది. సంక్రాంతిలోపు కొత్త రోడ్లతో పల్లెలు కళకళలాడనున్నాయి. మళ్లీ పల్లెపండుగ పేరుతో పూర్తయిన సిమెంటురోడ్లను ప్రారంభించేందుకు అధికారయంత్రాంగం సిద్ధమవుతోంది. జిల్లా వ్యాప్తంగా రోడ్ల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. ఇక ఆర్అండ్‌బీ రోడ్లలో గోతులు లేకుండా ప్రయాణం సాఫీగా సాగేందుకు ప్యాచ్ వర్క్‌లు జరుగుతున్నాయి.

వర్షంతో అంతరాయం..

జిల్లాలో రూ.110.33 కోట్ల వ్యయంతో సిమెంటు రోడ్ల నిర్మాణం, ఆర్అండ్‌బీ రోడ్ల ప్యాచ్‌వర్క్‌ల పనులు సాగుతున్నాయి. అయితే ఎడతెగకుండా వర్షం పడుతూనే ఉండటంతో తారురోడ్లలో ప్యాచ్‌వర్క్ పనులకు అంతరాయం కలుగుతోంది. ఇక పల్లెల్లో రూ.74.72 కోట్ల వ్యయంతో పంచాయతీరాజ్ ద్వారా 992పనులకు శ్రీకారం చుట్టారు. మొత్తం 161.55 కి.మీ మేర సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. ఇక ఆర్అండ్‌బీ రహదారులకు సంబంధించి జీవో నెం.53 ద్వారా రూ.15.89 కోట్లతో 658 కి.మీ మరమ్మతులు చేపడుతున్నారు. జీవో నెం.349 ద్వారా రూ.19.72 కోట్ల వ్యయంతో 830 కి.మీ మేర ప్యాచ్‌వర్క్‌లు చేస్తున్నారు. జీవో నెం.53 ద్వారా చేపట్టిన 110 పనులలో ఇప్పటికే 88 పనులు ప్యాచ్ వర్క్ జరుగుతున్నాయి. సంక్రాంతి నాటికి ఇవి పూర్తి చేయనున్నారు. ఇక జీవో నెం.349 ద్వారా చేపట్టిన పనులను జనవరి చివరి నాటికి పూర్తి చేసేందుకు ఆర్అండ్‌బీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో ఆర్అండ్‌బీకి మొత్తం 3200 కి.మీ రహదారులు ఉన్నాయి.


చిన్నరంగాపురం - నిడివిలగల రోడ్డు ప్యాచ్‌వర్క్‌కు ముందు, ప్యాచ్‌వర్క్ తరువాత

పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న సీసీ రోడ్ల వివరాలు

నియోజకవర్గం	పనులు	నిధులు (రూ.కోట్లలో)
మైదుకూరు	201	12
కమలాపురం	282	16.30
బద్వేలు	213	14.06
పులివెందుల	91	5.25
జమ్మలమడుగు	128	18.62
ప్రొద్దుటూరు	77	8.57

జీవో నెం.53ద్వారా ఆర్అండ్‌బీ రహదారులకు చేపట్టిన ప్యాచ్‌వర్క్‌లు

డివిజన్	మంజూరైన రోడ్లు	నిధులు (కోట్లలో)	కి.మీ (ప్యాచ్‌వర్క్)
కడప	34	24.2	281.7
పులివెందుల	34	5.47	137.11
ప్రొద్దుటూరు	42	8.02	244.82

- జీవో నెం.349 ద్వారా చేపట్టిన ప్యాచ్‌వర్క్ పనులు

డివిజన్	మంజూరైన రోడ్లు	నిధులు (కోట్లలో)	కి.మీ (ప్యాచ్‌వర్క్)
కడప	21	1.66	285.16
పులివెందుల	25	2.51	238
ప్రొద్దుటూరు	23	163	13.29


కొండాపురం - సింహాద్రిపురం రోడ్డు ప్యాచ్‌వర్క్

డిజిటల్ అరెస్టులనేవే లేవు

- అవన్నీ సైబర్ నేరగాళ్ల మోసాలు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్



కడప క్రైం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తగా ఉండాలని, డిజిటల్ అరెస్టులనేవే లేవని కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ తెలిపారు. ఏ బ్యాంకు వారు కూడా ఓటీపీలు అడగరన్నారు. తెలియని వ్యక్తులు ఎవరు అడిగినా ఓటీపీ చెప్పకూడదన్నారు. ఎవరికీ షేర్ చేయకూడదన్నారు. తెలియని లింకులు క్లిక్ చేయకూడదన్నారు. డిజిటల్ అరెస్టులు అనేవి సైబర్ నేరగాళ్లు చేసే మోసాలన్నారు. ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెడితే అధిక మొత్తంలో డబ్బులు రెట్టింపు అవుతాయనే సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మి ప్రజలు మోసపోకూడదన్నారు. నకిలీ లోన్ యాప్స్‌లో రుణాలు తీసుకోకూడదన్నారు. సులభంగా లోను పొందవచ్చని సామాజిక మాధ్యమాల ద్వారా లింకులు పంపుతారు, ఫోన్లు చేస్తారన్నారు. బ్యాక్‌గ్రౌండ్ వెరిఫికేషన్ లేకుండా ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండానే లోను ఇస్తామంటే అనుమానించాలన్నారు. మీకు తక్కువ మొత్తం లోను ఇచ్చి భారీ మొత్తం తిరిగి చెల్లించమంటారని లేకపోతే మీ గ్యాలరీలోని ఫొటోలు అశ్లీలంగా మార్ఫింగ్ చేసి మీ ఫోనులోని బంధువులకు, స్నేహితులకు పంపుతామని బెదిరిస్తారన్నారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే బాధిత ప్రజలు వెంటనే డయల్ 1930 కు ఫోను చేసి సమాచారం అందించాలన్నారు. నేషనల్ సైబర్ క్రైం పోర్టల్‌లో డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సైబర్‌క్రైం.జీవోవి.ఇన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

మరో ఆరునెలలు జేసీకి అదనపు బాధ్యతలు

కడప రూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ), డీసీఎంఎస్‌లకు జేసీ పర్సన్ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. ఈ గడువు గురువారంతో ముగియడంతో తాజాగా రాష్ట్ర ప్రభుత్వం జూన్ 26 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గత వైసీపీ పాలనలో త్రీమెన్ కమిటీ ద్వారా డీసీసీబీ పాలన కొనసాగించారు. ఈ ఏడాది జరిగిన సాధారణ ఎన్నికల్లో గెలుపొంది కూటమి అధికారంలోకి రావడంతో త్రీమెన్ కమిటీని రద్దు చేసింది. అన్ని రకాల సహకార సంఘాలకు ప్రభుత్వం అధికారులతో పర్సన్ ఇన్‌చార్జిలను 6 నెలల గడువుతో నియమించింది. ఈ గడువు గురువారంతో పూర్తి కావడంతో వీరి పదవీ కాలాన్ని మరో 6 నెలల పొడిగించింది.

పంటల బీమా.. రైతుకు ధీమాగా నిలిచేనా?

- వైసీపీ ప్రభుత్వంలో దక్కని బీమా
- ఈ-క్రాప్‌లో తప్పుల తడకతో నష్టం
- ఈ ప్రభుత్వమైనా పాత పద్ధతిని పూర్తి స్థాయిలో అమలు చేసేనా?

6



మామిడి రైతు గుల్ల

- మూడు రోజులుగా ముసురు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- ఆందోళనలో మామిడి రైతులు

6



మళ్లీ మన ప్రభుత్వం వస్తుంది..
అందరికీ న్యాయం చేస్తాం : జగన్

పులివెందుల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి మన ప్రభుత్వం వస్తుందని, అందరికీ న్యాయం చేస్తామని మాజీ ముఖ్యమంత్రి, పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా పులివెందులకు వచ్చిన జగన్ మూడోరోజు గురువారం ఉదయం 9గంటల నుంచి క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. పులివెందుల, కదిరి, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, తాడిపత్రి నియోజకవర్గాల నుంచి జనం పెద్దఎత్తున తరలివచ్చారు. మధ్యాహ్నం 1.30 వరకు ఈ కార్యక్రమం సాగింది. భోజనం అనంతరం తిరిగి 3గంటల నుంచి రాత్రి 8గంటల దాకా ప్రజాదర్బార్ సాగించారు. ఇందులో ప్రజలు వారి వ్యక్తిగత సమస్యలను జగన్‌కు విన్నవించుకున్నారు. పలువురు యువత ఉద్యోగ విషయమై ఆయనకు అర్జీలు ఇచ్చారు. అలాగే వృద్ధులు ఆరోగ్య సమస్యలపైన, మహిళలు ఉపాధిపైన జగన్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవ్వరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదన్నారు. మళ్లీ మన ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని అందరికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఎంపీ అవినాశ్‌రెడ్డి అందుబాటులో ఉంటాడని, ఏవైన సమస్యలు ఉంటే ఆయనకు తెలియజేయాలని ప్రజలకు సూచించారు.


పులివెందుల ప్రజాదర్బార్‌లో సమస్యలు వింటున్న మాజీ సీఎం వైఎస్ జగన్

ప్రజలను అదుపు చేయడంలో పోలీసుల పాట్లు

జగన్ ప్రజాదర్బార్ కార్యక్రమానికి ప్రజలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో పోలీసులు వారిని అదుపు చేయడంలో ఇబ్బందులు పడ్డారు. క్యాంప్ కార్యాలయంలోని ఒక గదిలో జగన్ ప్రజల సమస్యలు వింటున్నారు. ఆ గదిలోకి ప్రజలు పెద్ద సంఖ్యలో ఒకేసారి వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అదుపు చేయలేకపోయారు. ఆ సమయంలో గది అద్దం పగిలి ఓ మహిళకు స్వల్పగాయాలయ్యాయి. దీంతో పోలీసులు అందరినీ క్యూపద్ధతిలో రావాలని చెప్పారు. కానీ వారు పట్టించుకోకపోవడంతో రోప్ పార్టీ కోసం తెచ్చిన తాడుతో ప్రజలను కంట్రోల్ చేశారు. ఒక కానిస్టేబుల్ మాత్రం లాఠీ చార్జి చేశారని అంటున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు రామసుబ్బారెడ్డి, రమేశ్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రనాథరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మేయర్ సురేశ్‌బాబు తదితరులు ఉన్నారు.

కన్నులపండువగా వేంకటేశ్వరుడి కల్యాణం




మంగళసూత్రాలను చూపుతున్న అర్చకుడు

కడప ఎన్టీఆర్ సర్కిల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పచ్చని పందిరిలో అశేష భక్తజనం తిలకిస్తుండగా.. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరుని కల్యాణం కన్నులపండువగా సాగింది. గోవిందమాల భక్తబృందం సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం కడప మున్సిపల్ మైదానంలో జరిగిన ఈ కార్యక్రమానికి వేలాదిగా భక్తజనం తరలివచ్చారు. ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన ఉత్సవమూర్తులకు కమిటీ తరపున చైర్మన్ పుల్లారెడ్డి కల్యాణ వస్త్రాలను అందజేశారు. అన్నమాచార్య కీర్తనలు గోవిందనామ స్మరణలతో మైదానం మార్మోగింది. కల్యాణాన్ని తిలకించేందుకు కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, ఆర్.శ్రీనివాసరెడ్డి దంపతులతో పాటు మేయర్ కె.సురేశ్‌బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, అలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి తదితరులు హాజరయ్యారు. కళ్యాణం అనంతరం అక్కడకు వచ్చిన భక్తులందరికి స్వామివారి కంకణాలు, అక్షతలతో పాటు ముత్యాల తలంబ్రాలను పంపిణీ చేశారు. కల్యాణం అనంతరం సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం అత్యంత వైభవగా నిర్వహించారు. కోలాటాలు, చెక్కభజన, బ్యాండ్‌మేళాలు, వివిధ వేషధారణలు ఆకట్టుకున్నాయి.


స్వామివారి కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

తుఫాన్‌తో కందిపోతోంది

- జిల్లాలో 11,385 హెక్టార్లలో కంది సాగు
- రాలిపోయిన పూత
- నల్లగా మారిన కాయలు
- వెంటాడుతున్న తెగుళ్లు, పురుగుల బెడద
- లబోదిబోమంటున్న అన్నదాతలు

కడప రూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం కందిపంటను దెబ్బతీస్తోంది. వరుసగా ఒకదాని తరువాత ఒకటిగా వస్తున్న తుఫానులతో నాలుగైదు రోజుల పాటు ముసురు వర్షాలు కురుస్తుండటంతో కందిపంటకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. జూన్, జూలై నెలల్లో సాగుచేసిన కందిపంట ప్రస్తుతం కాయదశలో ఉండగా ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో పెట్టిన పంట పూత దశలో ఉంది. మరో నెల రోజుల్లో పంట చేతికి వస్తుందనుకున్న సమయంలో వరుస తుఫానులతో ముసురు వర్షాలు పడుతుండడంతో కందిపంటకు తెగుళ్లు, పురుగుల బెడద తీవ్రమైంది. దీంతో పూత రాలిపోయింది. కందికాయలు నల్లబారాయి. దిగుబడి సగం కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 11,385 హెక్టార్లలో కందిపంటను రైతులు విస్తారంగా సాగుచేశారు. ఖరీఫ్ ప్రారంభంలో వర్షాభావం కారణంగా కంది పంట ఎదగలేదు. తరువాత ఆగస్టు నుంచి వర్షాలు కురవడంతో కందిపంట ప్రాణం పోసుకుని ఆశించిన దిగుబడులు ఇచ్చే దిశగా పెరిగింది. దీంతో మంచి దిగుబడులు వస్తాయని రైతులు ఆశలు పెట్టుకున్నారు. రైతుల ఆశలను వరుస తుఫానులు నీరుగారుస్తూ వస్తున్నాయి. ఫెంగల్ తుఫాను నుంచి కొలుకుంటున్న తరుణంలో బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం ఏర్పడడంతో జిల్లాలో మూడు రోజులుగా ముసురు వాతావరణం కొనసాగుతోంది. దీంతో గురువారం జిల్లా అంతటా ఆకాశం మేఘావృతమైంది. పలు మండలాల్లో తేలికపాటి వర్షాలు పడ్డాయి. ఇదేతరహా పరిస్థితులు మరో రెండు రోజులు ఉండనున్నాయని వాతావరణ శాఖ పేర్కొంది. నేటిదాక వచ్చిన పంటను ముసురు వర్షాలు పాడుచేస్తుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. దీంతో జిల్లాలో సాగైన కందిపంట సక్రమంగా చేతికి వస్తుందా అనేది ప్రశ్నార్థకంగా మారింది.


ముసురు వర్షాలతో పూత రాలిపోయిన కందిపంట

రైతులను అప్రమత్తం చేస్తున్నాం..



తుఫాను వచ్చినప్పుడల్లా వాటి నుంచి పంటను కాపాడుకునే చర్యలపై రైతులను అప్రమత్తం చేస్తున్నాం. ముసురు వర్షాలతో కందిపంట పూత రాలకుండా, కాయకు పురుగు పట్టకుండా ఏయే రకాల మందులను పిచికారి చేయాలో శాస్త్రవేత్తల ద్వారా తెలియజేస్తున్నాం. అయినప్పటికి పంట దిగుబడులు రాకపోతే పంట ఇన్సూరెన్స్ కవర్ అవుతుంది.

- నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయాధికారి

పెట్టుబడులు కూడా కష్టమే

నెల రోజుల నుంచి వరుస తుఫానుల కారణంగా కందిపంటలో పెట్టుబడులు కూడా వచ్చే అవకాశం లేదు. ఎకరా పొలంలో కంది సాగుచేయడానికి రూ.18వేల నుంచి రూ.22 వేల వరకు పెట్టుబడి అవుతుంది. తుఫానుల ప్రభావంతో విపరీతంగా తెగుళ్ల సోకడంతో వాటి నివారణకు అదనంగా మరో రూ.5 వేలు ఖర్చుచేసి మందులను పిచికారిచేయాల్సి వస్తోంది. ఈ లెక్కన ఒక ఎకరాలో కంది సాగుకు మొత్తం రూ.23 నుంచి రూ.27 వేలు వెచ్చించారు. సాధారణంగా ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉంది. తుఫానుల కారణంగా తెగుళ్ల, పురుగుల బెడద వెంటాడడంతో రెండు, మూడు క్వింటాళ్లు కూడా రావడం కష్టంగా మారింది. ప్రస్తుతం మార్కెట్‌లో కంది క్వింటా రూ.4 వేల లోపే ధర పలుకుతోంది. దిగుబడి తగ్గిపోవడంతో పెట్టుబడికూడా నష్టపోవాల్సి వస్తోందని రైతులు కన్నీటిపర్యంతం అవుతున్నారు.

మండలాల వారీగా కందిపంట సాగు హెక్టార్లలో..

కొండాపురం	260
మైలవరం	288
పెద్దముడియం	2,088
చాపాడు	9
దువ్వూరు	22
మైదుకూరు	68
బి.మఠం	48.93
కాశినాయన	211.9
కలసపాడు	119
పోరుమామిళ్ల	69.95
బి.కోడూరు	26.35
బద్వేలు	4.4
ఖాజీపేట	36.46
రాజుపాళెం	463
ప్రొద్దుటూరు	245
జమ్మలమడుగు	409
ముద్దనూరు	868
సింహాద్రిపురం	604.2
లింగాల	314.41
పులివెందుల	505.12
వేముల	156.45
తొండూరు	2794
వీఎన్‌పల్లి	613.03
యర్రగుంట్ల	788.71
కమలాపురం	24.77
వల్లూరు	28.3
సీకేదిన్నె	14.9
పెండ్లిమర్రి	49.55
వేంపల్లి	33.68
చక్రాయపేట	221.17

- వైసీపీ ప్రభుత్వంలో దక్కని బీమా
- ఈ-క్రాప్‌లో తప్పుల తడకతో నష్టం
- ఈ ప్రభుత్వమైనా పాత పద్ధతిని పూర్తి స్థాయిలో అమలు చేసేనా ?

పంటల బీమా.. రైతుకు ధీమాగా నిలిచేనా?

పులివెందుల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పంటల బీమా పథకం రైతులకు భరోసా ఇవ్వడం లేదు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన ఈ-క్రాప్ విధానం తప్పులతడకగా ఉండటంతో తమకు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన చెందుతూ వచ్చారు. పంటలకు బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుందని నాటి వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంది. అయితే.. ఆ మేరకు ఒక్క ఏడాది కూడా రైతులకు పంటల బీమా సక్రమంగా అందలేదు. కూటమి ప్రభుత్వం అయినా పాతపద్ధతినే పూర్తి స్థాయిలో అమలుచేసి రైతుకు ధీమానిస్తుందా లేక వైసీపీ పద్ధతినే అవలంబిస్తుందో తెలియాల్సిఉంది.

పంట సాగుచేసేందుకు రైతులు బ్యాంకుల్లో ప్రతి ఏడాదిపంట రుణాలు తీసుకుంటారు. తీసుకునే సమయంలోనే ఏ పంటకు రుణాలు తీసుకుంటున్నారో దానికి సంబంధించి బీమా ప్రీమియం బ్యాంకుకు చెల్లిస్తారు. బ్యాంకుల్లో రుణాలు పొందని రైతులు నేరుగా మీసేవ ద్వారా లేదా ప్రైవేట్ సంస్థల ద్వారా ప్రీమియం చెల్లించి బీమా చేసుకుంటారు. ఇది వైసీపీ ప్రభుత్వం రాకమునుపు సాగుతున్న తంతు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన అనంతరం పంట రుణాలు తీసుకునే రైతుల నుంచి పంటలకు సంబంధించిన ప్రీమియం వసూలుచేయవద్దని ప్రభుత్వమే చెల్లిస్తుందని బ్యాంకులకు ఆదేశాలిచ్చింది. దీనితో బ్యాంకులు ప్రీమియం వసూలు చేయకుండా కేవలం తీసుకున్న పంట రుణాలకు రెన్యువల్ చేసుకుని వడ్డీ వసూలు చేయడంతోనే సరిపెడుతూ వచ్చారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు ప్రీమియం సక్రమంగా చెల్లించకపోవడంతో పంటనష్టపోయిన సమయంలో పరిహారం అందక రైతులు నష్టపోయారు. ఇటు కడప జిల్లా అటు అన్నమయ్య జిల్లా రైతాంగం కరువు కాటకాలతో అల్లాడుతూంటారు. గత నాలుగైదేళ్లుగా పంటల దిగుబడి చూస్తే ఏ ఒక్క ఏడాది కూడా రైతులకు లాభాలు చేకూరింది లేదు. వర్షాలు కూడా సాగు చేయడానికి వీలుగా అనువైన సమయంలో కురవడం లేదు. పదును దాటాక కురిసిన వర్షానికి పంట సాగుచేస్తే గింజ మొలకెత్తి ఏపుగా పెరిగినా.. కాతకాసే సమయానికి లేదా పంట ఒబ్బిడి చేసే వేళకు వర్షాలు రాక పంటలు ఎండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు ఆ పంటలకు బీమా చేసి ఉంటే ప్రభుత్వం ఆ మేరకు సొమ్మును ఇచ్చి రైతులను ఆదుకునే వెసులుబాటు ఉంటుంది. కానీ గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో రైతులు సాగుచేసిన పంటలకు ప్రీమయం చెల్లించలేదు. రైతులు చెల్లించవద్దని తామే చెల్లిస్తామని వైసీపీ ప్రభుత్వం ప్రకటించింది. ఇ-క్రాప్ విధానంతో బీమా పరిహారం అందిస్తామని చెప్పింది. అయితే ఈ ఏడాది కూడా రైతు సాగుచేసిన పంటలన్నిటికి పూర్తిస్థాయిలో పరిహారం దక్కలేదు. కంటితుడుపు చర్యగా బీమా పరిహారం చెల్లించారు. ఒక్క రైతు పది ఎకరాల పంట సాగుచేస్తే మూడు, నాలుగు ఎకరాలు సాగుచేసినట్లు ఇ-క్రాప్‌లో నమోదు చేశారు. దీంతో ఆ మూడునాలుగు ఎకరాలకు అరకొర పరిహారం ప్రభుత్వం విదిల్చేది. పంట సాగుచేసినా ఏ పంట వేశారనే వివరాలు కూడా ఈ-క్రాప్‌లో లేకపోవడంతో ఆ రైతులకు మరింత నష్టాలనే మిగిల్చింది.


పులివెందుల ప్రాంతంలో సాగులో ఉన్న శనగ

ఫసల్ బీమా తొలగించడంతో తీవ్ర నష్టం

ముఖ్యంగా రైతులు ఖరీఫ్‌లో పంటల సాగుకు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని అదే సమయంలో ఆ పంటకు ఫసల్ బీమాకోసం ప్రీమియం కూడా చెల్లిస్తారు. ఫసల్ బీమాలో రైతులకు ఎంతో వెసులుబాటు ఉండేది. ఫసల్ బీమా కోసం రైతులు దరఖాస్తు చేసుకుంటే పంట సాగు సమయంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించి వర్షాలు పడక పంట సాగుకాకపోయినా కొంత మొత్తం రైతులకు దక్కుతుంది. అంటే పంట సాగుచేసి పంటల మధ్యకాలంలో వర్షాలు కురవక పంట ఎండిపోతేనే బీమా వస్తుందన్నది వాతావరణ బీమా పద్ధతి. కానీ పంట సాగుసమయంలో వర్షాలు కురవక పోయినా ప్రకృతి వైపరీత్యమే అని కేంద్ర ప్రభుత్వం ఈ వెసులుబాటు కల్పించింది. కానీ వైసీపీ ప్రభుత్వం ప్రీమియం తామే చెల్లిస్తామని ప్రకటించి పాత పద్ధతిని పూర్తిగా తొలగించింది. దీంతో ఏ పంటకు రుణాలు తీసుకోవాలో, ఏ పంటకు ప్రీమియం చెల్లించాలో రైతులకు అర్థం కాకుండా మారిపోయింది. దీనికి తగ్గట్టే వైసీపీ ప్రభుత్వంలో రైతులకు పంటల బీమా సక్రమంగా అందలేదు.

ఈ ప్రభుత్వమైనా ధీమానిస్తుందా

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పాత పద్ధతిలోనే పంటల బీమా అమలు చేస్తామని ప్రకటించింది. కానీ దానికి ఈ-క్రాప్ లింకప్ చేస్తామనడంతో రైతులు ఈ ప్రభుత్వం కూడా వైసీపీ ప్రభుత్వంలాగా చేస్తుందేమోనని అనుమానిస్తున్నారు. బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకునే సమయంలోనే ఆ పంటకు ప్రీమియం తీసుకునే పరిస్థితి ఉంటే ఈ-క్రాప్ పద్ధతి ఎలా కుదురుతుందని ప్రశ్నిస్తున్నారు.

పంట సాగు సమయంలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా వర్షాలు కురవక పంటే సాగుకాకపోతే ఈ-క్రాప్ ఎక్కడి నుంచి తేవాలని అంటున్నారు. వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన ఈ-క్రాప్ పద్ధతి పూర్తిగా పక్కన పెట్టేయాలని రైతులు కోరుతున్నారు. రైతులు సాగుచేసిన పంటకు ప్రీమియం చెలిస్తే నష్టం జరిగిందా లేదా అని గుర్తించి బీమా ఇస్తే రైతులకు కాస్తోకూస్తో భరోసా దక్కుతుంది. 2014-2019లో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో పంటల బీమాకు సంబంధించి ఎలాంటి విధానాలు అమలు చేసిందో అదే పద్ధతిని అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.


పులివెందులలో సాగులో ఉన్న కంది పంట

హత్య కేసులో నిందితుల అరెస్ట్ : డీఎస్పీ


విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ కృష్ణమోహన్

గాలివీడు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కళాకారుడు సత్యన్న హత్య కేసులో నిందితులైన వెంకటరమణారెడ్డి, అతడి కుమారులైన శివ శంకర్‌రెడ్డి, రామాంజులరెడ్డిలను గురువారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని బోరెడ్డిగారిపల్లె గ్రామ కస్పాలో పెద్దకర్మ సందర్భంగా కీచకవధ వీధి నాటకం ప్రదర్శించారు. ఈ సందర్భంగా వెంకట్రామిరెడ్డి కీచకుడి పాత్ర పోషించగా తలారి పాత్రను సత్యన్న అలియాస్ వెంకటరమణ పోషించారు. నాటకం ప్రదర్శించే సందర్భంలో ఇరువురి మధ్య మనస్పర్థల కారణంగా గొడవ మొదలైంది. ఈ గొడవ విషయంలో గ్రామంలో ఉన్న పెద్దలు జోక్యం చేసుకుని సర్దిచెప్పినా వినకుండా నాటకం మధ్యలోనే ఆపివేశారు. ఈ క్రమంలో సత్యన్న, రమణారెడ్డిలు తిరుగు ప్రయాణమై బోరెడ్డిగారిపల్లె బస్టాప్ వద్దకు రాగానే వెంకట్రమణారెడ్డి సత్యన్న తలపై బండరాయితో బలంగా కొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే వెంకటరమణారెడ్డి తన కుమారులకు ఫోన్ చేసి సంఘటనాస్థలానికి పిలిపించుకుని తన సొంత ఆటోలో సత్యన్న మృతదేహాన్ని వేసుకుని సమీపంలోని మంగళపల్లి గుట్ట వద్ద పడవేసినట్లు, ఈ హత్యను తామే చేసినట్లు నిందితులు డీఎస్పీ ఎదుట అంగీకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు హాజరుపర్చనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును ఛేదించిన లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి, ఎస్ఐ రామకృష్ణలను అభినందించారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి, ఎస్ఐ రామకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతదేహం, పవన్‌కుమార్ (ఫైల్)

గాలివీడు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాలివీడు, కోనంపేట ప్రధాన రహదారిలో ఆటో ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో కోట్లపల్లి పవన్‌కుమార్ (18) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. లక్కిరెడ్డిపల్లె మండలం పందిళ్లపల్లె గ్రామం హరిజనవాడకు చెందిన పవన్‌కుమార్ గాలివీడు పంచాయతీ హరిజనవాడలో తన సోదరి ఇంటికి వచ్చి తిరుగు పయనమయ్యాడు. నూలివీడు, లక్కిరెడ్డిపల్లె సమీపంలోకి రాగానే లక్కిరెడ్డిపల్లె నుంచి గాలివీడుకు వస్తున్న ఆటో.. ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో పవన్‌కుమార్ తలకు బలమైన గాయమైంది. అదే మార్గంలో వస్తున్న డీఎస్పీ కృష్ణమోహన్, సీఐ కొండారెడ్డి, ఎస్ఐ రామకృష్ణ ప్రమాద స్థలంలో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న క్షతగాత్రుడిని వారి వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఘాట్‌లో రక్షణ గోడను ఢీకొట్టిన లారీ



రామాపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గువ్వలచెరువు ఘాట్ 2వ మలుపు వద్ద గురువారం సిమెంటు లారీ అదుపు తప్పి రక్షణ గోడను ఢీకొని ఆగిపోయింది. ప్రమాదం నుంచి డ్రైవర్, క్లీనర్ ప్రాణాలతో బయటపడ్డారు. రక్షణగోడ లేకుంటే 50 అడుగుల లోతు లోయలో సిమెంటుతో సహా లారీ పడిపోయేది. చిరుజల్లులు కురుస్తుండడం, రోడ్డుపై తేమ ఉండడంతో టైర్లు, రోడ్డు గ్రిప్పు కోల్పోవడం వల్లే మలుపులో ఘాటు దిగుతూ ప్రమాదానికి కారణమైనట్లు తెలుస్తోంది.

'సూర్య ఘర్'పై అవగాహన కల్పించాలి

- ఎస్ఈ రమణ


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ రమణ

పీలేరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనపై విద్యుత్ వినియోగులకు విస్తృత అవగాహన కల్పించాలని విద్యుత్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ రమణ పీలేరు డివిజన్‌లో విద్యుత్ ఉద్యోగులను ఆదేశించారు. పీలేరు డివిజన్ ప్రగతిపై గురువారం ఆయన స్థానిక ఈఈ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్య ఘర్ యోజన ద్వారా రూఫ్ టాప్ సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం ఒక కిలో వాట్‌కు రూ.30 వేలు, రెండు కిలో వాట్‌లకు రూ.60 వేలు, మూడు కిలో వాట్‌లకు రూ.78 వేల చొప్పున రాయితీ అందిస్తోందన్నారు. రాయితీ పోను మిగిలిన మొత్తానికి అతి తక్కువ వడ్డీతో బ్యాంకులు రుణాలు అందిస్తాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా వినియోగదారులను చైతన్యపరచాలని ఆయన తెలిపారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు లోవోల్టేజ్ సమస్యను అధిగమించాలని, అందుకు నెలకు నాలుగు ట్రాన్స్‌ఫార్మర్ల చొప్పున నిర్వహణ పనులు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఈఈ చంద్రశేఖర రెడ్డి, డీఈలు అమీర్‌బాషా, శివయ్య, పీలేరు, కేవీపల్లె, కలికిరి, కలకడ, గుర్రంకొండ, వాల్మీకిపురం మండలాల ఏఈలు, జేఈలు, అకౌంట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

కలకడలో...

కలకడ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు పీఎం సూర్యఘర్ యోజన పథకం ద్వారా సబ్సిడీతో ఏర్పాటు చేయనున్న సోలార్ రూఫ్‌టాప్‌ను వినియోగించుకోవాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ రమణ కోరారు. కలకడ మండలం కె.కొత్తపల్లెలో జరుగుతున్న అర్హుల గుర్తింపు నమోదును గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వినియోగదారులు తమ అవసరాలకు వాడుకోగా మిగిలిన విద్యుత్‌కు ఒక యూనిట్‌కు రూ.2.30 పైసలు తిరిగి పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, డీఈ శివయ్య, ఏఈ రాజశేఖర్ పాల్గొన్నారు.

మామిడి రైతు గుల్ల

- మూడు రోజులుగా ముసురు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- ఆందోళనలో మామిడి రైతులు


రైల్వేకోడూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా పడుతున్న ముసురు వర్షంతో ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ వర్షంతో మామిడికి పూతలు వచ్చే అవకాశం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముందుగా వచ్చిన పూతలు కూడా ఈ వర్షంతో మాడిపోయాయి. కొన్ని తోటల్లో వర్షం దెబ్బకు పూర్తిగా పూత రాలిపోయింది. దీంతో మామిడి రైతు గుల్ల అయ్యాడు. మూడు రోజులుగా తుఫాన్ కారణంగా ముసురు వర్షం పట్టింది. ఇప్పటికే పలు దఫాలుగా భారీ వర్షాలు కురవడంతో మామిడి రైతులు ఆందోళనలో పడ్డారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని ఓబులవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు మండలాల్లో ఎక్కువగా మామిడి తోటలను రైతులు సాగు చేస్తున్నారు. నియోజకవర్గంలో మామిడి సుమారు 20 వేల హెక్టార్లలో రైతులు సాగు చేస్తున్నారు. మామిడికి పూత దశలో వర్షం కురిస్తే మాడిపోతుంది. రైల్వేకోడూరు నియోజకవర్గంలో మామిడికి ముందస్తుగానే పూతలు వచ్చాయి. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. అయితే తుఫాన్ కారణంగా పలు దఫాలుగా వర్షాలు కురవడంతో వచ్చిన పూతలు రాలిపోవడంతో పాటు మగ్గిపోయాయి. మామిడి రైతులకు ఈ వర్షాలు శాపంలా మారాయని వాపోతున్నారు. వర్షాలు కురిసి ఆగిపోయిన తర్వాత ఒకవేళ నిలిచినా వచ్చిన కాయలకు మంగు ఏర్పడుతుందని వ్యాపారులు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా మామిడి తోటల్లో ఇప్పటికీ పూతలు రాలేదు. ఇప్పటికే రైతులు మామిడి తోటలకు మందులు పిచికారీ చేసి ఉన్నారు. దున్నకాలు, ఎరువులు, పురుగు మందులు తదితర వాటికి ఎకరాకు రూ.30 వేలు ఖర్చు చేశారు. గత ఏడాదిలో దిగుబడులు 20 శాతం వచ్చాయి. ఈ ఏడాది 5 శాతం కూడా దిగుబడులు వచ్చేలా లేవని రైతులు వాపోతున్నారు. రైతులు మామిడి తోటల దున్నకాలు, ఎరువులు, పురుగు మందుల కోసం వ్యాపారుల నుంచి డబ్బులు ముందస్తుగా తీసుకున్నారు. తీసుకున్న రుణాలకు వడ్డీలు వచ్చే ఏడాదికి వడ్డీలు పెరుగుతాయి. దిగుబడులు బాగా వస్తే ఇచ్చిన రుణాలు తీరిపోయి డబ్బులు మిగులుతాయని రైతులు అంటున్నారు. భూమిలో తేమ శాతం ఎక్కువగా ఉండడంతో పూతలు త్వరగా వస్తాయన్న నమ్మకం రైతుల్లో లేదు. వర్షాలు పూర్తిగా ఆగిపోయిన తర్వాత మళ్లీ మందులు పిచికారీ చేస్తే పూతలు వచ్చినా కాయలు కోతకు ఆలస్యం అవుతుందని వ్యాపారులు అంటున్నారు. రైల్వేకోడూరు మామిడి కాయల కంటే ముందస్తుగా విజయవాడ, బంగారుపాళెం, తమిళనాడు, కర్ణాటక తదితర ప్రాంతాలకు చెందిన మామిడి కాయలు మార్కెట్‌లోకి ప్రతి ఏడాది వస్తాయి. దీంతో రైల్వేకోడూరు మామిడి కాయలకు డిమాండ్ పెద్దగా ఉండకపోవచ్చునని పలువురు రైతులు అంటున్నారు. ఇదే వర్షాలు అక్కడ కూడా ఉంటే అన్ని ప్రాంతాలకు చెందిన మామిడి కాయలు ఒకేసారి ఆలస్యంగా వచ్చే అవకాశాలు ఉన్నాయని రైతులు అంటున్నారు. మొత్తానికి వర్షాలు రైల్వేకోడూరును వీడడం లేదు. మూడు రోజులుగా తుంపరతో మొదలైన ముసురు వర్షం పట్టిపీడిస్తోంది. వర్షాలు పూర్తి స్థాయిలో తగ్గిపోయి ఎండ బాగా కాస్తే మామిడికి పూతలు వచ్చే అవకాశాలు ఉంటాయని శాస్త్రవేత్తలు, ఉద్యాన శాఖాధికారులు అంటున్నారు.


పూతరాని మామిడి చెట్లు


రైల్వేకోడూరు లో కురుస్తున్న వర్షం


రైల్వేకోడూరులో కమ్ముకున్న మేఘాలు


మామిడికి వర్షం దెబ్బ



మామిడికి వర్షం దెబ్బపడింది. ముందస్తుగా వచ్చిన పూతలు రాలిపోయాయి. కొన్ని తోటల్లో మగ్గిపోయినాయి. దీంతో రైతులు అల్లాడుతున్నారు. ఉమ్మకాపుతో కొందరు రైతులు కోలుకున్నారు. బేనీషా, తోతాపూరి, నీలం, మాల్గోవా, చెరుకు రసం, ఖాదర్, మల్లిక, రుమాణి, పులిహోరా తదతర రకాల మామిడి కాయలకు మంచి డిమాండు ఉంటుంది. అయితే వర్షం దెబ్బకు మామిడి రైతులు డీలా పడ్డారు. వరుణ దేవుడు కురుణించి మామిడి రైతులను కాపాడాలి.

- కస్తూరి రామచంద్రయ్యనాయుడు, రైల్వేకోడూరు మామిడి రైతు

మామిడి సాగుకు ఖర్చు అధికం



మామిడి సాగుకు ఖర్చు ఎక్కువగా ఉంది. ఇది రైతులకు ప్రతి ఏటా భారంగా మారింది. దున్నకాలు, ఎరువులు, పురుగు మందులు తదితర వాటికి ఎక్కువగా ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రతి ఏటా కాయలకు మంగు వస్తోంది. దీంతో మార్కెట్లోకి కాయలు పోవడం లేదు. వర్షంతో కాయలకు మచ్చపడుతోంది. చాలామంది రైతులు వేపనూనెను పిచికారీ చేయడంతో చాలా మంది రైతుల తోటలకు మేలు కలగడమే కాకుండా పూతలు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

- సాదు చంద్రపాల్, మైసూరివారిపల్లె, మామిడి రైతు, వ్యాపారి

వైద్య సిబ్బందిపై డీఎంహెచ్‌వో ఆగ్రహం


సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో నాగరాజు

సిద్దవటం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోదిన్‌సాహెబ్‌పల్లె పాఠశాలలో గురువారం నిర్వహించిన రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమాన్ని కడప డీఎంహెచ్‌వో నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని అంగన్వాడీ ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఎత్తు, బరువు, హిమోగ్లోబిన్ పరీక్షలు చేసి ప్రతి విద్యార్థి ఆరోగ్యవంతులుగా ఉండేలా మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కడప-చెన్నై జాతీయ రహదారి మాధవరం, ఉప్పరపల్లె పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉండడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్లె ప్రాంతాల్లో మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి జ్వరాలు ప్రజలకు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండి తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని తెలిపారు. 104 వైద్యసేవలు ప్రతి గ్రామంలో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో మాధవరం ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ శివకుమార్, సూపర్‌వైజర్ రమణయ్య, వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్ రాజయ్య మృతి



రైల్వేకోడూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబేడ్కర్‌నగర్ వాసి 11వ బెటాలియన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న 1995వ బ్యాచ్‌కు చెందిన చోడవరం రాజయ్య గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. 15 రోజుల విధుల నిమిత్తం విజయవాడలోని తాడేపల్లిలో గల సీఎం క్యాంప్ కార్యాలయానికి వెళ్లారు. రెండు రోజులుగా ఆయన అనారోగ్యం తో బాధపడుతున్నారు. గురువారం చికిత్స నిమిత్తం విజయవాడలోని ఓ ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

పెద్దతిప్పసముద్రం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఓ బాలికను మాయమాటలతో లొంగదీసుకుని తీసుకెళ్లిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసిన సంఘటన పెద్దతిప్పసముద్రం మండలంలో జరిగింది. పీటీఎం ఎస్ఐ రవికుమార్ అందించిన వివరాలిలా ఉన్నాయి. కందుకూరుకు చెందిన గుర్రాల నరసింహులు అనే యువకుడు ఓ బాలికకు మాయమాటలు చెప్పి లొంగదీసుకుని తీసుకెళ్లి పోయాడన్నారు. ఆ బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఆ యువకుడిని పట్టుకుని అతడిపై పోక్సో కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడికి గాయాలు

కలకడ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాలపురం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు అన్వర్‌సాహెబ్‌కు గాయాలయ్యాయి. మండలంలోని ఎనుగొండపాలెం పంచాయతీ దిగువపాలెం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అన్వర్ సాహెబ్ ఉదయం కలకడ నుంచి ద్విచక్ర వాహనంలో విధులకు బయలుదేరాడు. ఈ క్రమంలో గుర్రంకొండ నుంచి వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఉపాధ్యాయుడికి రక్తగాయాలు కావడంతో 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చౌటపల్లెలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఆర్‌ఎస్‌కే భవన సముదాయం



రూ.లక్షల వ్యయం... లక్ష్యానికి దూరం

● అసంపూర్తిగా రైతు సేవా కేంద్రాల భవన నిర్మాణాలు ● ఆర్‌ఎస్‌కేల్లో కియోస్క్ సేవలు అంతంతే

ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాల్లో రైతుసేవా కేంద్రాల (ఆర్‌ఎస్‌కే) ద్వారా అన్నదాతలకు అరకొర సేవలు అందుతున్నాయి. ఈ వ్యవస్థ అమలులోకి వచ్చి నాలుగేళ్ల పూర్తయినా వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఇప్పటికీ బాలరిష్టాలు దాటలేదు. ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులో లేకపోవడం, సాంకేతిక సమస్యలతో చాలా చోట్ల కియోస్క్ యంత్రాల సేవలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. రైతులు తమకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల వివరాలను నమోదు చేసుకుంటే ఎవరికి ఏరకం కావాలో తెప్పించే అవకాశం ఉండేది. నేడు ఆ పరిస్థితి కానరావడం లేదు.

గత వైసీపీ ప్రభుత్వ పాలనలో 2020 మే నెలలో రైతు భరోసా కేంద్రాలు (ప్రస్తుత రైతుసేవా కేంద్రాలు) ఏర్పాటు చేశారు. తొలుత ప్రభుత్వ భవనాలు లేని ప్రాంతాల్లో ప్రైవేటు భవనాలను అద్దెకు తీసుకున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా సొంత భవన నిర్మాణాలకు అనుమతి ఇచ్చారు. లక్షల రూపాయల వ్యయంతో మొదలు పెట్టిన ఈ భవనాలు కొన్ని ప్రాంతాల్లో మాత్రమే పూర్తయ్యాయి. చాలా చోట్ల నిధుల మంజూరులో జాప్యం కావడంతో అసంపూర్తిగా నిర్మాణాలు ఆగిపోయాయి. మరికొన్ని చోట్ల స్థలాల సమస్యతో భవన నిర్మాణాలు బాలరిష్టాలు దాటడం లేదు. దీంతో చాలా చోట్ల అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

అసంపూర్తిగా రైతు సేవా కేంద్ర భవన నిర్మాణాలు

ప్రొద్దుటూరు వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలోని ప్రొద్దుటూరు మండల పరిధిలో 17, జమ్మలమడుగు మండల పరిధిలో 13, మైలవరం మండల పరిధిలో 13, పెద్దముడియం మండల పరిధిలో 12 కలిపి మొత్తం 55 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. ఈ డివిజన్ పరిధిలో 32 వేల హెక్టార్లలో రబీ పంటలు సాగు చేస్తున్నారు రైతులు. వేరుశనగ, మినుము, పెసర, నువ్వులు, శనగ, జొన్న, పొద్దుతిరుగుడు, వరి తదితర పంటల సాగులో ఉన్నాయి. రైతులకు కావాల్సిన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు, సలహాలు, సూచనలతో రైతుల శ్రేయస్సుకోసం ఈ సేవా కేంద్రాలు ఎంతగానో దోహదపడుతున్నాయి. అయితే ప్రొద్దుటూరు మండల పరిధిలో 17 కేంద్రాల్లో పెద్దశెట్టిపల్లె, ఉప్పరపల్లె, చౌడూరు, కామనూరు, చెన్నమరాజుపల్లె, చౌటపల్లె, దొరసానిపల్లె, సోములవారిపల్లె, గోపవరంలలో ఆర్‌ఎస్‌కే కేంద్రా భవన నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఉప్పరపల్లె, చౌడూరు, చౌటపల్లె, చెన్నమరాజుపల్లెల్లో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మిగిలిన ప్రాంతాల్లో గ్రామ సచివాలయాల్లోనే సేవలు అందిస్తున్నారు.

● జమ్మలమడుగు మండల కేంద్రంలో రైతుసేవా కేంద్రాలకు స్థల సమస్య వెంటాడుతోంది. జమ్మలమడుగు, మోరగుడి, కన్నెలూరు ప్రాంతాల్లో స్థల సమస్యతో రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలు ప్రారంభం కాలేదు. మిగిలిన కేంద్రాల్లో నూతన భవనాలు పూర్తయినా అవి వినియోగంలోకి రాలేదు.

● పెద్దముడియం మండల పరిధిలో పెద్దపసుపుల పంచాయతీలో 2, నెమళ్లదిన్నె, బీటీపాడు, జంగాలపల్లె, ఉలువలపల్లెల్లో అద్దె భవనాల్లో ఈ కేంద్రాలు కొనసాగుతున్నాయి. మైలవరం మండల పరిధిలో 13 సేవా కేంద్రాలు ఉండగా కొన్ని ప్రాంతాల్లో ఇలాంటి సమస్యలే తలెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వంలో కియోస్క్ యంత్రాలు, అసంపూర్తి భవన నిర్మాణాలపై దృష్టి సారించి పూరిస్థాయిలో వినియోగంలోకి వచ్చేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



కియోస్క్ సేవలు అంతంతే..

రైతు సేవా కేంద్రాల్లో విత్తనం నుంచి విక్రయం వరకు అన్నదాతలకు సేవలు అందించాల్సిన కియోస్క్ సేవలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. రైతు చేతివేళ్ల అనుసంధానించడానికి, రైతులకు అవసరమయ్యే సూచనలు, సలహాలకు యూట్యూబ్ చానెళ్లను వినియోగించి కియోస్క్ యంత్రాల ద్వారా వీడియో ప్రచారం చేయాల్సి ఉంది. కేంద్రాల్లో ఇంటర్నెట్ వసతి అందుబాటులోలేదు. వ్యవసాయ సహాయకులు మాత్రం తమ వద్ద ఉన్న సెల్‌ఫోన్లలో, ట్యాబ్‌లలో సీమేడ్ యాప్ ద్వారా వివరాలను నమోదు చేస్తూ రైతులకు సేవలు అందిస్తున్నారు. దీంతో లక్షల వ్యయంతో వీటిని ఏర్పాటు చేసినప్పటికి నిరుపయోగంగా ఉన్నాయి.

తాళ్లమాపురంలోని రైతుసేవా కేంద్రంలో ఉన్న కియోస్క్ యంత్రం

అన్ని యంత్రాలు పనిచేస్తున్నాయి

ఆర్‌ఎస్‌కేలలో అన్ని యంత్రాలు పనిచేస్తున్నాయి. సెల్‌ఫోన్లలో అందుబాటులో ఉన్న యాప్‌ల ద్వారా రైతులకు ఇబ్బందులు లేకుండా వ్యవసాయ సహాయకులు సేవలు అందిస్తున్నారు. సమస్యలు ఉంటే గుర్తించి పరిష్కరిస్తాం.

\- డి.సురేష్‌రెడ్డి
వ్యవసాయ సహాయ సంచాలకులు

జీవో145ను ఉపసంహరించాలి

● పీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి



మాట్లాడుతున్న పీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి

కడప రూరల్, డిసెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్ కేసుల విచారణను కడపలో కాకుండా తిరుపతిలో విచారణ చేపట్టేందుకు ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని పీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి డిమాండ్ చేశారు. ఈగిల్ (ఫాస్ట్ ట్రాక్ కోర్టు)ను తిరుపతిలో ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ కడప న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఎదుట చేపడుతున్న రిలే నిరాహారదీక్షలు గురువారానికి 18వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన దీక్షలకు సంఘీభావం తెలియజేసి మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్ కేసుల విచారణను కడపలో కాకుండా తిరుపతిలో ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు తరలించడం వలన కక్షిదారులు ఎంతో వ్యయప్రయాసాలు పడాల్సి వస్తుందన్నారు. కడపలో ఉన్న కోర్టును కడపలోనే కొనసాగించాలని.. కడప నుంచి తిరుపతికి తరలిస్తూ ఇచ్చిన జీవో 145ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం అందె సుబ్రమణ్యం, ఆనందర్‌రెడ్డి, ప్రతాప్ రెడ్డి, లక్ష్మీకర్, రాజగోపాల్ రెడ్డి తదితరులు దీక్షలను చేపట్టారు. కార్యక్రమంలో కడప బార్‌అసోసియేషన్ అధ్యక్షులు బొగ్గుల గుర్రప్పనాయుడు, పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

టీడీపీ, వైసీపీలు అప్పుల్లో దొందూదొందే..

అప్పుల కుప్పలు చేసి ప్రజలపై బాదుడుకు దిగడంలో వైసీపీ, టీడీపీ దొందు దొందే అని పీసీసీ అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. గురువారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం బాదుడు ప్రభుత్వంగా మారిందని మండిపడ్డారు 6 నెలల పాలన కాలంలో అనేక విధాలుగా ప్రజలపై భారం మోపిందన్నారు. అసెంబ్లీ కో- ఆర్డినేటర్ బండి జకరయ్య కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

ఇద్దరు యువకులపై కొడవలితో దాడి...

కురబలకోట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు యువకులపై కొడవలి, రాడ్‌తో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన గురువారం మండలంలో జరిగింది. చింతమాకులపల్లె పంచాయతీ అమ్మచెరువు మిట్ట సమీపంలో అదే ప్రాంతానికి చెందిన శ్రీనివాసులు(32), బసినికొండకు చెందిన అతని సమీప బంధువు గుణశేఖర్ (22)లు బీపీ రాజు ఇంటి సమీపంలో నిలబడి మాట్లాడుతుండగా అనుమానంతో రాజు అతని కుటుంబీకులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ యువకులను మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గుణశేఖర్‌ను మెరుగైన చికిత్సల నిమిత్తం తిరుపతికి రెఫర్ చేశారు. ముదివేడు పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని విచారించారు. ఎస్‌ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

29న జూనియర్స్ కబడ్డీ సెలక్షన్స్

కడప స్పోర్ట్స్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కడప నగర మున్సిపల్ కార్పొరేషన్ గాంధీనగర్ పాఠశాలలో ఈనెల 29న ఆదివారం ఉమ్మడి కడప జిల్లా సబ్‌జూనియర్స్ కబడ్డీ ఎంపికల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.గోవర్ధనరెడ్డి వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలో గల కబడ్డీ క్రీడాకారులు తప్పక హాజరై ప్రతిభ చాటాలన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన అభ్యర్థులు ఏపీ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లాలో వచ్చే జనవరి 3, 4, 5,6 తేదీల్లో జరగనున్న 28వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. జిల్లాస్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు వారి తాలుకా ఆధార్‌కార్డు, పదోతరగతి ఒరిజినల్ మార్కు లిస్టు, స్టడీ సర్టిఫికెట్ తప్పక వెంట తీసుకురావాలన్నారు. 20 సంవత్సరాల కేటగిరిలో పాల్గొనే బాలబాలికలు 2005 డిసెంబరు 1న జన్మించిన వారు అర్హులన్నారు. ఇదిలా ఉండగా బాలికలు 65 కేజీలు, బాలురు 70 కేజీల్లోపు ఉండాలన్నారు. ఏదైనా ఇతర వివరాలకు... 9949851059 అనే నెంబరును సంప్రదించాలని కోరారు.

30న శ్రీహరికోటకు ఆర్టీసీ బస్సు

బద్వేలు రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డిపో నుంచి శ్రీహరికోటకు ఈనెల 30న బస్సు ఏర్పాటు చేస్తారని ఆర్టీసీ డీఎం కన్యాకుమారి పేర్కొన్నారు. ఇస్రోలో శాస్త్రవేత్తలు ప్రయోగించనున్న రాకెట్‌ను సందర్శించే అవకాశాన్ని విద్యార్థినీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాను పోను టిక్కెట్ ధర రూ.800 ఉంటుందని తెలిపారు. రాకెట్ లాంచింగ్ ముందు పెంచలకోన, సూళ్లూరుపేట చెంగాలమ్మగుడి, పులికాట్ సరస్సులను చూడవచ్చన్నారు. స్లాట్ బుకింగ్ కోసం విద్యాసంస్థలు రిజిస్ట్రేషన్ కాపీని అందజేయాలని, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం పేరు వయస్సు, ఆధార్ కాపీలను పంపాలన్నారు. వివరాల కోసం 9959225779, 7382867104 నెంబర్లను సంప్రదించాలని గురువారం ఒక ప్రకటనలో కోరారు.

వైవీయూ పరీక్షలు జనవరి 21కి మార్పు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి):యోగివేమన యూనివర్సిటీ, అనుబంధ పీజీ కళాశాలల ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంపీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు 2025 జనవరి 21వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పీజీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి తెలిపారు. ముందుగా డిసెంబరు 30 నుంచి నిర్వహించాలని నిర్ణయించామని అయితే విద్యార్థుల ప్రయోజనాన్ని దృష్టలో ఉంచుకొని మార్పు చేశామన్నారు. జనవరి 21, 23, 25, 27, 29, 31 తేదీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్షలు ఉంటాయన్నారు.

పులివెందుల సబ్‌జైలును తనిఖీ చేసిన జడ్జి

పులివెందుల టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పులివెందుల సబ్ జైలులో లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను గురువారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలు, ఆరోగ్య విషయాలను తెలుసుకున్నారు., అనంతరం జైలు పరిసరాలు, వంట గదులను, వసతి గదులను పరిశీలించి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌బాబా ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్ కానిస్టేబుల్ వీఆర్‌కు..

కొండాపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కొండాపురంలో సీఐ డ్రైవర్‌గా పనిచేస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ రాయుడును వీఆర్‌కు పంపినట్లు సీఐ మహమ్మద్ రఫీ తెలిపారు. కానిస్టేబుల్ రాయుడు ఫోన్‌లో లైంగికంగా వేధిస్తున్నాడని ఓ మహిళ ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి.. ఆయనను వీఆర్‌కు పంపారు. ప్రస్తుతం రాయుడుపై విచారణ జరుగుతోందని సీఐ తెలిపారు.

పాఠశాలకు వాటర్‌ప్లాంటు వితరణ



ఉచిత మినరల్ వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న వైవీయూ మాజీ వీసీ సూర్యకళావతి

కమలాపురం రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తన తండ్రితో పాటు తాము చదువుకున్న పాఠశాలకు సేవ చేయాలనే ఉద్దేశ్యంతో సుమారు రూ.6లక్షల విలువజేసే వాటర్ ప్లాంట్ వితరణగా అందించినట్లు మండల పరిధిలోని దాదిరెడ్డిపల్లెకు చెందిన శ్యామ్ సుందర్‌రెడ్డి తెలిపారు. గురువారం అయన పెద్దచెప్పలి జిల్లా పరిషత్ హైస్కూలులో తన తండ్రి జనార్ధన్‌రెడ్డి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఉచిత వాటర్ ప్లాంటును యోగి వేమన యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ సూర్యకళావతితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతివిద్యార్థి బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ విద్యా సలహాదారుడు సాంబశివారెడ్డి, ఎంఈఓ సుభాషిణి, చంద్రకాంత్‌రెడ్డి, డాక్టర్ మాధవి, ప్రధానోపాధ్యాయుడు ఓబుల్‌రెడ్డి, పాఠశాల కమిటీ ఛైర్మన్లు పుల్లారెడ్డి, మైసూరారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కడప సంస్కృతి, సంప్రదాయాలు గొప్పవి : వీసీ



మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారతదేశం విభిన్న సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమని.. కడప సంస్కృతి ఎంతో గొప్పదని యోగి వేమన యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం యోగివేమన యూనివర్సిటీ ప్రాగణంలో భారత ప్రభుత్వ నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో ఇంటర్ డిస్ట్రిక్ట్ యూత్ ఎక్సేంజ్ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ విశాఖపట్టణానికి చెందిన యువత కడప జిల్లా చరిత్రను, విశిష్టతను తెలుసుకునేందుకు ఇక్కడకి రావడం అభినందనీయమన్నారు. డిసెంబరు 26 నుంచి 30వ తేదీ వరకు జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాలను యువత సందర్శిస్తారని అన్నారు. ఇతర ప్రాంతాలలోని వారసత్వ కట్టడాలను చూడడం ద్వారా సమాజంపైన యువతకు ఒక అవగాహన ఏర్పడుతుందన్నారు. సమాజంలో ఎదిగేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు.

వైవీయూ కళాశాల ప్రిన్సిపల్ రఘునాధరెడ్డి, రిజిస్ట్రార్ పుత్తా పద్మ మాట్లాడుతూ సంస్కృతిక సాంప్రదాయాల కోసం ప్రత్యేకంగా ఇలాంటి వేదికలు రూపొందించినపుడు ప్రతి ఒక్కరు ముందడుగు వేయాలని యువతకు పిలుపునిచ్చారు. నెహ్రూ యువకేంద్రం జిల్లా యువజన అధికారి మణికంఠ, జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ కడప అంటే బాంబుల గడ్డ కాదు కవులకు నిలయం అన్నారు. కార్యక్రమంలో వైవీయూ ఎన్‌ఎస్‌ఎస్ లక్ష్మి, నెహ్రూ యువకేంద్ర అకౌంట్స్ ఆఫీసర్ బాబురెడ్డి, సిబ్బంది, జాతీయ సేవ కార్యకర్తలు పాల్గొన్నారు.

కారు - బైకు ఢీ... వ్యక్తి మృతి



సింహాద్రిపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) మండలంలోని అగ్రహారం గ్రామ సమీపాన సింహాద్రిపురం-పులివెందుల రోడ్డులో కారు-మోటారు బైకు ఢీకొన్న ప్రమాదంలో కొమ్మా నీలకంఠారెడ్డి(65) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ తులసీనాగప్రసాద్ సమాచారం మేరకు... కసనూరు గ్రామానికి చెందిన నీలకంఠారెడ్డి బైకుపై వస్తుండగా సింహాద్రిపురం నుంచి పులివెందుల వైపు వెళ్లే కారు ఢీ కొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. మృతునికి భార్య, కొడుకు, ఇద్దరు కూతుర్లు కలరు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం పులివెందుల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి.. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



జమ్మలమడుగు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులోని నాగులకట్టవీధిలో రైల్వేస్టేషన్ వెళ్లే దారిలో దూదేకుల మనోహర్ (41) అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. నాగులకట్ట వీధికి చెందినమనోహర్‌ను భార్య విడిచిపెట్టి వెళ్లిపోవడంతో గత కొన్ని నెలలుగా పట్టణంలో తిరుగుతూ.. వీధుల్లో ప్లాస్టిక్ బాటిళ్లు తదితర వస్తువులు తీసుకుని ప్లాస్టిక్‌వ్యాపారుల వద్ద విక్రయించేవాడు. అయితే ఉన్నట్లుండి బైపాస్ రోడ్డు పక్కన అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అర్బన్ ఎస్‌ఐ రామకృష్ణ, సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లారీ కింద పడి మహిళ మృతి



రామలక్షుమ్మ(ఫైల్)

సిద్దవటం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడప- చెన్నై జాతీయ రహదారి కనుమలోపల్లె శనీశ్వర గుడి సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో రామలక్షుమ్మ (55) మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. గురువారం ఉదయం అట్లూరు మండలం కమలకూరు గ్రామం నుంచి రామక్రిష్ణారెడ్డి, రామలక్షుమ్మ(55) ద్విచక్ర వాహనంలో కడపకు వెళుతున్నారు. కనుమలోపల్లె శనీశ్వర గుడి సమీపానికి రాగానే వర్షానికి ద్విచ క్రవాహనం అదుపు తప్పడంతో కింద పడ్డారు. అదే సమయంలో కర్నూలు నుంచి చెన్నైకు వెళుతున్న లారీ కింద వెనుక వైపు కూర్చు న్న రామలక్షుమ్మ పడటంతో మృతి చెందింది. శవ పంచనామా నిమిత్తం రిమ్స్‌కు తరలించి కేసు నమో దు చేసినట్లు ఒంటిమిట్ట ఇన్‌చార్జి ఎస్‌ఐ శివప్రసాద్ తెలియజేశారు.

ఆగి ఉన్న కారును ఢీకొన్న లారీ

● తప్పిన ప్రమాదం

సికెదిన్నె, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గువ్వల చెరువు ఘాట్‌లో ఆగి ఉన్న కారును లారీ ఢీకొంది. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరుగలేదని సీకెదిన్నె పోలీసులు తెలిపారు. వారు అందించిన సమాచారం మేరకు కడప నుంచి రాయచోటివైపు వెళుతున్న కారు మూడవ మలుపు వద్ద ఆగి ఆంజనేయస్వామి గుడిలోకి వెళ్లి దర్శనం చేసుకుంటుండగా అదే సమయంలో రాయచోటి వైపు నుంచి ఘాట్ దిగుతున్న లారీ అదుపు తప్పి కారుపైకి దూసుకొచ్చి మట్టికట్టపైకి ఎక్కి ఆగిపోయింది. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రాణ నష్టం జరుగలేదని తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

టిప్పర్ ఢీకొని గొర్రెలు మృతి

ముద్దనూరు డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి):మండల పరిధి కడప తాడిపత్రి హైవే రోడ్డులోని ఓబులాపురం గ్రామం వద్ద గురువారం రాత్రి గొర్రె ల మందపై టిప్పర్ దూసుకెళ్లడంతో ఓబులాపురం గ్రామానికి చెందిన గొర్రెల కాపరి గనేష్‌కు చెందిన 10 గొర్రెలు మృతి చెందాయి. గొర్రెల కాపరి గనేష్ సమాచారం మేరకు.. గొర్రెల మందను మేతకోసం కొండకు తోలుకెళ్లి తిరిగి ఓబులాపురం గ్రామం వస్తుండగా కొండాపురం వైపు టిప్పర్ అతివేగంగా రోడ్డు పక్కన వెళుతున్న గొర్రెల మందపైకి దూసుకు వచ్చింది. దీంతో దాదాపు 10 గొర్రెలు మృతి చెందాయి. టిప్పర్ డ్రైవర్ ఆపకుండా వెళ్లాడని, దాదాపు రెండు కిలోమీటర్ల వద్ద టిప్పర్‌ను నిలిపామని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నట్లు బాధితుడు గొర్రెల కాపరి తెలిపారు.

విద్యార్థినిపట్ల అనుచిత ప్రవర్తన

పోరుమామిళ్ల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యాబుద్ధులు చెప్పాల్సిన ఉపాధ్యాయుడు విద్యార్థిని పట్ల అనుచితంగా ప్రవర్తించాడు. దీంతో బాధిత విద్యార్థిని తల్లిదండ్రులు, గ్రామస్థులు ఉపాధ్యాయుడిపై దాడి చేసేందుకు ప్రయత్నించారు. చుట్టుపక్కల వారు జోక్యం చేసుకుని సమస్యను సర్దుబాటు చేశారు. కాగా జరిగిన విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లారు. వివరాల్లోకెళితే... పోరుమామిళ్ల మండలంలోని ఓ జిల్లా పరిషత్తు హైస్కూలులో 6వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థినిపై హిందీ ఉపాధ్యాయుడు అనుచితంగా ప్రవర్తించాడు. ఆ విషయం ఆ విద్యార్థిని తల్లిదండ్రులకు తెలపడంతో వారు గురువారం స్కూలు వద్దకు చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న కొందరు అతనిపై ఎక్కడ దాడి చేస్తారోనని భావించి ముందుగానే ఓ తరగతిగదిలో ఉంచి నట్లు తెలిసింది. వెంటనే వారు రెవెన్యూ సదస్సులో తహ సీల్దార్ చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఉపాధ్యాయుడు పాఠశాలను వదిలి వెళ్లిపోవాలని, మళ్లీ వస్తే సహించేది లేదని గ్రామస్థులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ విషయమై ఎంఈఓ అంకిరెడ్డిని వివరణ కోరగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అక్కడ జరిగిన విషయాన్ని తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. గతంలో కూడా ఆ ఉపాధ్యా యుడిపై ఫిర్యాదులు అందాయని, జరిగిన విషయాలను డిప్యూటీ డీఈఓ దృష్టికి తీసుకువెళుతున్నట్లు ఆయన తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ

యువకుడికి గాయాలు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతబోలు గ్రామంలోని వంగాడవారిపల్లెలో గురువారం భూ వివాదంలో ఇరువర్గాల ఘర్షణ పడ్డారు. వంగాడవారిపల్లెకు చెందిన వెంకటేష్ కుమారుడు సతీష్(28) అదే గ్రామానికి చెందిన శివకుమార్‌లు పొలం దున్నకం గురించి గొడవపడ్డారు. దీంతో శివకుమార్ ఆవేశంతో సతీష్‌పై కొడవలితో దాడి చేసి గాయపర్చారు. గాయపడిన బాధితున్ని వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు.

కారు ఢీ.. మహిళ మృతి

అట్లూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో సంగటి సుబ్బమ్మ(70) దుర్మరణం చెందింది. లింగాల కుంట వాసి సుబ్బమ్మ లింగాల కుంట వద్ద రోడ్డు దాటుతుండగా రాజంపేట నుంచి వస్తున్న కారు ఢీకొనడంతో ఆమె తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఢీకొన్న కారులో బద్వేలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె అప్పటికే మృతి చెందినట్లు అక్కడి వైద్యులు తెలిపారు. కారు పెనగలూరు ఎంపీడీఓకు చెందినదిగా స్థానికులు గుర్తించారు.

అన్యాక్రాంతమైన దేవదాయ భూములను తిరిగి అప్పగించాలి

● రెవెన్యూ సదస్సులో ఆర్డీఓను కోరిన ఆలయ కమిటీ సభ్యులు, రైతులు



ఆర్డీఓ జాన్ ఇర్విన్‌కు భూముల సమస్యలు చెబుతున్న శివారెడ్డి

చెన్నూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అన్యాక్రాంతమైన దేవదాయ భూములన్నీ తిరిగి అప్పగించాలని చెన్నూరు నాగలింగేశ్వరాలయ కమిటీ సభ్యుడు, గంగసాని శివారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ శివారెడ్డి ఆర్డీఓ జాన్ ఇర్విన్‌ను కోరారు. చెన్నూరులో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సుకు కడప ఆర్డీఓ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏమైనా సమస్యలుంటే తెల పాలన్నారు. అందుకు వారు స్పందిస్తూ మం డల వ్యాప్తంగా 11 రెవెన్యూ గ్రామ పంచాయతీల్లో 166.71 ఎకరాలు భూమి ఉందని, అం దులో కొంత మాత్రమే దేవదాయ పరిధిలో ఉందన్నారు. మిగిలినదంతా ఆక్రమణలో ఉం దన్నారు. ఆక్రమణలను వెలికితీయాలని కోరారు. మండలంలో ఎంతో పురాతనమైన ఆలయాలు ఉన్నాయని, దాతలు ఆలయాల అభివృద్ధి, ధూపదీప నైవేద్యాల కోసం భూములు రాసి ఇస్తే కొందరు ఆ భూములను ఆక్రమించుకున్నారన్నారు. ఆ భూములను దేవదాయ శాఖ ద్వారా బయటికి తీయించి ఆలయాలకు అప్పగిస్తే ధూపదీప నైవేద్యాలతో పాటు అర్చకులకు జీతాలు, ఉత్సవాలు, ఊరేగింపులు నిర్వహించేందుకు వీలుంటుంద న్నారు. వారి సమస్యలు విన్న ఆర్డీఓ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో జరిగే రెవెన్యూ సదస్సుకు దేవదాయ శాఖ సిబ్బందిని పిలిపించి వారి ద్వారా ఆయాప్రాంత పరిధిలో ఉన్న పాత ఆలయాలకు సంబంధించిన భూములను బయటికి తీయిస్తామ న్నారు. అనంతరం రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలు అర్జీల రూపంలో అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సరస్వతి, సర్వేయరు సోమశేఖర్, డీటీ వెంకటరమణ, ఆర్ఐ కౌశిక్, వీఆర్వోలు రసూల్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వంగవీటి మోహనరంగాకు నివాళి



వంగవీటికి నివాళులర్పిస్తున్న తుంగా రమణయ్య

కడప సెవెన్ రోడ్స్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వంగవీటి మోహనరంగ 36వ వర్ధంతి సందర్భంగా కడప జనసేన నాయకుడు తుంగా రమణయ్య నివాళులర్పించారు. ఈ సందర్భంగా తుంగా రమణయ్య మాట్లాడుతూ బెజవాడ ఉనికి ఉన్నంత కాలం గుర్తుండిపోయే గొప్ప వ్యక్తి వంగవీటి మోహనరంగ అని కొనియాడారు. బడుగు బలహీన వర్గాల కోసం తుదిశ్వాస వరకు పోరాడి ప్రాణాలొడ్డిన గొప్పనాయకుడు మోహనరంగ అన్నారు. ఆయన స్ఫూర్తి, పోరాట తత్వం ఉప ముఖ్యమంత్రి, జనసేనాని పవన్‌కళ్యాణ్‌లో చూసుకుంటున్నామని పేర్కొన్నారు.

రీ సర్వే ద్వారా రైతులకు అవస్థలు



రైతుల సమస్యలను వినతిపత్రం ద్వారా తెలియజేస్తున్న రఘునాథరెడ్డి తదితరులు

వేంపల్లె, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన రీసర్వే వల్ల ప్రస్తుతం రైతులకు అవస్థలు ఎదురవుతున్నాయని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తహసీల్దార్ హరినాథరెడ్డిని వేంపల్లె మండల టీడీపీ పరిశీలకుడు రఘునాథరెడ్డి కోరారు. గురువారం నిర్వహించిన మండలంలోని ముతుకూరు రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. రైతులకు సమస్యలు ఉన్నందున కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు. టీడీపీ మండల కన్వీనర్ మునిరెడ్డి, పక్కీరారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, జయరామ్, శ్రీనివాసులరెడ్డి, రోశిరెడ్డి, గోవర్దన్‌రెడ్డి, సర్వేయర్ గంగయ్య, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో తెగులును నివారించుకోవచ్చు



పొలంపిలుస్తోందిలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

కమలాపురం రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విత్తనశుద్ధి చేయడం ద్వారా తెగులును నివారించవచ్చని మండల వ్యవసాయాధికారి సరస్వతి తెలిపారు. గురువారం మండల పరిధిలోని దాదిరెడ్డిపల్లె, అప్పారావుపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతునుద్దేశించి మాట్లాడుతూ విత్తనం వేసే సమయంలో విత్తనశుద్ధి తప్పక చేసుకోవాలన్నారు.

దాని వల్ల ఎక్కువ శాతం తెగులు రాకుండా అరికట్టవచ్చన్నారు. అదే విధంగా మేలైన విత్తన రకాలను ఎంపిక చేసుకోవాలని రైతులకు సూచించారు. మినుము, వేరుశెనగ పంటలను పరిశీలించారు. వేరుశెనగలో సూక్ష్మ దాతు లోప నివారణకు, సూక్ష్మధాతు మిశ్రమ ఎరువులైన ఫార్ములా 4 లేదా గ్రోత్ లేదా మ్యాక్స్ ఎకరాకు ఒక కిలో మిశ్రమాన్ని పంట వేసిన 30 - 40 మరియు 60 - 70 రోజులకు పిచికారి చేయాలన్నారు. అలాగే రైతులకు పంటలపై ఇంకా సూచనలు సలహాలు అందించారు.

'ప్రజాదరణ చూసి ఓర్వలేకే దుష్ప్రచారం'

కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక అతనపై దుష్ప్రచారం చేస్తున్నారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. గురువారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్ జగన్ స్వయంకృషితో పార్టీ స్థాపించి ముఖ్యమంత్రి అయ్యారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలో పర్యటిస్తున్నారని, ఆయన్ను చూసేందుకు ప్రజలు అత్యధిక సంఖ్యలో తరలిస్తున్నారన్నారు.

రూటా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎన్నిక





సయ్యద్ ఇక్బాల్... సయ్యద్ ముష్తాఖ్

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉర్దూ టీచర్ అసోసియేషన్ (రూటా) రాష్ట్ర అధ్యక్షుడిగా సయ్యద్ ఇక్బాల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ ముస్తాఖ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కడప నగరంలోని సిటీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన ఎన్నికల ప్రక్రియకు ఎన్నికల అధికారి సయ్యద్ హిదాయతుల్లా, పరిశీలకులుగా డాక్టర్ నిసార్ అహ్మద్ వ్యవహరించారు.రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా అబ్దుల్ మునాఫ్, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శిగా పి.ఎస్.జి.అసదుల్లా బాషా, రాష్ట్ర మహిళ కార్యదర్శిగా షేక్ జబీనలు ఎన్నికయ్యారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా షాహిదుల్లా, సత్తార్ ఫైజి, అబ్దుర్ రఖీబ్, డాక్టర్ నఖివుల్లా, అబ్దుల్ హమీద్, మహమ్మద్ గయాస్, మహమ్మద్ రఫి ఎంపికయ్యారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కార్యదర్శులు, సహాయ ఆర్థిక కార్యదర్శులు, రాష్ట్ర డెయిరీ కమిటీ ఛైర్మన్లు, రాష్ట్ర కన్వీనర్లను ఎన్నుకున్నారు.

పెండింగ్ వేతనాలు తక్షణం ఇవ్వాలి: ఏఐటీయూసీ



సమావేశంలో మాట్లాడుతున్న బాదుల్లా తదితరులు

కడప సెవెన్ రోడ్స్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రీసోర్స్ పర్సన్ల వేతనాలు వేతనాలు విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా డిమాండ్ చేశారు. గురువారం స్థానిక హోచిమిన్ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బాదుల్లా మాట్లాడారు. ఆర్పీలకు మూడు నెలలుగా జీతాలు అందలేదన్నారు. సంక్రాంతి పండుగ కూడా దగ్గరలోనే ఉండటంతో చేతిలో చిల్లిగవ్వ లేక ఆర్పీలు అప్పుల కోసం పరుగులు తీయాల్సి వస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నగర పాలక, పురపాలక పట్టణాల పరిధిలో సుమారు ఆరు వేల మందికిపైగా ఆర్పీలు విధులు నిర్వహిస్తున్నారని, వీరికి ప్రభుత్వం ప్రతినెల రూ.8వేల గౌరవవేతనంతో పాటు మరో రూ.2వేలు అప్లోడ్ చేసిన దరఖాస్తును బట్టి చెల్లిస్తుంటారన్నారు. అయితే సెప్టెంబర్, అక్టోబరు, నవంబరు మాసాలకు సంబంధించి జీతాలు పెండింగ్‌లో ఉండటంతో ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి మద్దిలేటి, జిల్లా కార్యదర్శి లింగన్న, నాయకులు ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా

కడప(వినాయకనగర్), డిసెంబరు26 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమ్మెతో ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికుల ఒప్పందాల జీఓల జారీపై గురువారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మున్సిపల్ డ్రైవర్స్ కమిటీ సుంకర కిరణ్ అధ్యతన సీఐటీయూ ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులకు రెగ్యులర్ చేయాలన్నారు. ఎన్నో పోరాటాల ద్వారా గత ప్రభుత్వంలో వచ్చిన జీఓలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నగర అధ్యక్షుడు సుంకర రవి మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులకు 15 వేల మాత్రం చెల్లిస్తున్నారని, అలవెన్సులు ఇవ్వడం లేదన్నారు. కార్మికులను పర్మినెంట్ చేయకుండా ఒప్పంద కార్మికుల పేరుతో కాలయాపన చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర అధ్యక్షులు చంద్రారెడ్డి, మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి విజయభాస్కర్, ఉపాధ్యక్షులు తిరుపాల్, కోశాధికారి గోపీ, నాయకులు ప్రకాశ్, ఆనందరావు, నాగరాజు, కేశవులు, అజీముద్దీన్‌నాయక్, వెంకటేశ్, ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువలో కెనరా బ్యాంకు

సికెదిన్నె, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రజలకు చేరువలో కెనరాబ్యాంకు ముందుందని కెనరాబ్యాంకు జనరల్ మేనేజర్ పాండురంగ మితంతయ్య, ఆర్ఎం.మురళీమోహన్ తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలంలోని మూలవంక కెనరా బ్యాంకు పునరుద్ధరణ ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ కస్టమర్లకు సన్మానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలతోపాటు వివిధ రకాల సూక్ష్మ, స్థూల పరిశ్రమలకు రుణాలు అందించి పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి బ్యాంకు అవసరమైన సేవలను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏజీఎం మురళీమోహన్, మేనేజర్ ప్రవీణ్, సుబ్బారెడ్డి, రమేష్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉపాధి పనులపై ఓపెన్ ఫోరం

పెండ్లిమర్రి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో ఉపాధి పనులపై శుక్రవారం ఓపెన్ ఫోరం జరగనుంది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి హాజరవుతారని మండల టీడీపీఅధ్యక్షుడు గంగిరెడ్డి తెలిపారు. టీడీపీ నాయకులు,కార్యకర్తలు రావాలని తెలిపారు.

'నేడు వైసీపీ పోరుబాట'

పులివెందుల టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి):విద్యుత్ చార్జీలు తగ్గించాలని పులివెందులలో శుక్రవారం వైసీపీ ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నేతలు తెలిపారు. పాత ఎమ్మెల్యే కార్యాలయం నుంచి మినీ సెక్రటేరియట్ వద్ద ఉన్న కరెంటు ఆఫీసు వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, ఎస్‌వీ సతీష్‌కుమార్‌రెడ్డి పాల్గొంటారన్నారు.

చలమారెడ్డిపల్లె రోడ్డంతా గుంతలు



కడప(వినాయకనగర్), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్ పరిధిలోని 2వ డివిజన్ చలమారెడ్డిపల్లిలో ప్రధాన దారితో పాటు వీధుల్లో రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. చిన్నపాటి వర్షం పడినా గుంతలు నిండా మురికి నీరు దర్శనమిస్తోంది. ముఖ్యంగా ప్రధాన రహదారి నుండి మాచువల్లికు వెళ్లే రోడ్డు చలిమారెడ్డి పల్లి దాటే వరకు రోడ్డంతా గుంతలు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా ఓక్కేలి, మాచువల్లి, సంటిగారిపల్లె, సిద్దవటం వరకు ఆయా గ్రామాల ప్రజలు ఈ దారిలోనే ప్రయాణిస్తుంటారు. తమ అవసరాల నిమి త్తం ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లలో తిరుగుతుంటారు. చమలారెడ్డిపల్లిలో ప్రయాణం మాత్రం ఆందోళనకరంగా ఉందని స్థానికులు తెలిపారు. గత ఏడాదిగా రోడ్ల సమస్య వెంటాడుతోందని తెలిపారు. అడుగడుగునా గుంతలు ఉండటంతో వాహనాలు కూడా రిపేర్లకు వస్తున్నాయని తెలిపారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



సిమెంటు రోడ్డు నిర్మించాలి

చలమారెడ్డిపల్లె రోడ్డు బాగా దెబ్బతింది. జాతీయ రహదారి నుంచి చలమారెడ్డిపల్లె దాటే వరకు (మాచుపల్లి రోడ్డు) సిమెంటు రోడ్డు నిర్మించాలి.

-రామసాదయ్య, చలామారెడ్డిపల్లి

టీడీపీలో చేరిన వైసీపీ అభిమానులు



వైసీపీ వారు టీడీపీలో చేరడంతో ఎమ్మెల్యే మాధవి,ఆర్.శ్రీనివాసరెడ్డిలను అభినందిస్తున్న అండ్లూరి బాలక్రిష్ణారెడ్డి, లక్ష్మీదేవి దంపతులు

కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని 8వ డివిజన్ మాసాపేటలో డివిజన్ కార్పొరేటర్ లక్ష్మీదేవి, బాలకృష్ణ ఆధ్వర్యంలో వైసీపీ వర్గీయులు టీడీపీలో చేరారు. వీరితో పాటు ఆ డివిజన్‌లో ఉన్న వలంటీర్స్ కూడా టీడీపీలో చేరారు. వారికి టీడీపీ జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాసులరెడ్డి, కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

ప్రతి సమస్యనూ పరిష్కరించేందుకు కృషి

● కడప ఎమ్మెల్యే మాధవి, పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కడప నియోజకవర్గం ప్రజలకు సంబంధించిన ప్రతి సమస్య పరిష్కరించేందుకు కృషిచేస్తామని కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి, పొలిట్ బ్యూరో సభ్యు లు శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం క డప నగరం ద్వారక నగర్ వారి నివాసంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ప్రజ లు హాజరై వారి సమస్యలను ఎమ్మెల్యే దృ ష్టికి తీసుకెళ్లారు. ప్రతి సమస్య తెలుసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప నగరంలో ప్రజలు అనే క సమస్యలతో వస్తున్నారన్నారు. ప్రతి సమస్యనూ పరష్కరిస్తామన్నారు.

టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తకు భరోసా

పెండ్లిమర్రి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తకు భరోసాఉంటుందని రాష్ట్ర కార్యదర్శి చంద్ర ఓబుల్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పాత సంగటిపల్లె గ్రామంలో గురువారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించారు. ఈ సదర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి ఆదేశాల మేరకు పాతసంగటిపల్లె పంచాయతీలో సభ్యత్వాలు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటసుబ్బారెడ్డి,మైసూరారెడ్డి, అయ్యావారురెడ్డి, సురేంద్రరెడ్డి, శివారెడ్డి, గోవిందురెడ్డి, కత్తి చెంద్రాయుడు, పంచాయతీలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలో ముళ్లపొదల తొలగింపు



ముళ్లపొదలను తొలగిస్తున్న దృశ్యం

లింగాల,డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): లింగాల ఎస్సీకాలనీ వాసులకు ఎంతో ఇబ్బందిగా ఉన్న ముళ్లపొదలను గురువారం సా యం త్రం తొలగించారు. 20రోజుల క్రితం ఆ ముళ్లపొదల్లో హైనా చేరి కలకలం రేపిన విషయం తెలిసిందే. బుధవారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాతిరెడ్డిపల్లె పర్యటనలో భాగంగా లింగాల మీదుగా వెళ్తున్న సమయంలో కాలనీ వాసులు ముళ్లపొదల స మస్యను జగన్ దృష్టికి తెచ్చారు. గురువారం సాయంత్రం ఎంపీ అవినాష్‌రెడ్డి జేసీబీని పంపడంతో ముళ్లపొదలు మొత్తం తొలగించారు.

ఘనంగా సీపీఐ శత వార్షికోత్సవాలు



సీపీఐ జండా ఆవిష్కరణ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గాలి చంద్ర తదితరులు

కడప సెవెన్ రోడ్స్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీపీఐ శత వార్షికోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. గురువారం సీపీఐ కార్యాలయంలో జరిగిన పార్టీ శత వార్షికోత్సవాల్లో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పాల్గొని మాట్లాడారు. సీపీఐ 1925 డిసెంబరు 26న కాన్పూర్‌లో ఆవిర్భవించి 2024 డిసెంబరు 26 నాటికి వంద సంవత్సరాలు పూర్తిచేసుకొని శతజయంతి ఉత్సవాలు నిర్వహించుకోబోతోదన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో పార్టీ శాఖలు అమరవీరుల స్థూపాలకు నివాళులు అర్పించి, జెండా ఆవిష్కరణ, కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులు వార్షికోత్సవ సభల సమావేశాలు నిర్వహించారన్నారు. సీపీఐ నగర కార్యదర్శి ఎస్.వెంకటశివ, జిల్లా కార్యవర్గ సభ్యురాలు ఎస్.విజయలక్ష్మి, మద్దిలేటి పాల్గొన్నారు.

'త్యాగాలకు ప్రతిరూపం సీపీఐ'

కడప మారుతీనగర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): త్యాగాలకు ప్రతిరూపం సీపీఐ అని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గుంటి వేణుగోపాల్, ఎస్.విజయలక్ష్మి కొనియాడారు. సీపీఐ 100వ సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా గురువారం ఎర్రముక్కపల్లె సర్కిల్‌లో ఉపాధ్యాయ ఉద్యమ నేత, సీనియర్ నాయకుడు రాజాసాహెబ్ చేతుల మీదుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు.

శత జయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి

ఈ నెల 28న శనివారం తలపెట్టిన సీపీఐ శత జయంతి ఉత్సవాల ర్యాలీ, బహిరంగ సభను జయప్రదం చేయాలని వేణుగోపాల్ కోరారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు నాగార్జునరెడ్డి, రామక్రిష్ణ, ఏఐటీయూసీ నాయకులు సుబ్బరాయుడు, తారక రామారావు, శాంతమ్మ, రేణుక కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల కోసం సీపీఐ పోరాటం

వేంపల్లె, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పేద బడుగు బలహీన వర్గాల ప్రజల సమస్యల కోసం సీపీఐ నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సుబ్రమణ్యం, పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకటరాములు, సహాయ కార్యదర్శి బ్రహ్మం పేర్కొన్నారు. పార్టీ జండాను ఆవిష్కరించారు.

అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తాం

వీరపునాయునిపల్లె, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని యు.రాజుపాలెం గ్రామంలోని అమరవీరుల స్తూపాల వద్ద పతాకాన్ని ఎగరవేసి అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. సీపీఐ కమలాపురం ఏరియా కార్యవర్గ సభ్యులు చెంద్రాయుడు, దస్తగిరి,చంద్రకాంత్,ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి పి.చక్రధర్, నాయకులు పాల్గొన్నారు.

రూ. 3కోట్లకు బడ్జెట్‌పై చర్చ

ఎర్రగుంట్ల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): 2024-2025కు సంబంధించిన బడ్జెట్‌పై ఎర్రగుంట్ల నగర పంచాయతీ సర్వసభ్య సమావేశంలో చర్చించారు. గురువారం చైర్మన్ మూలె హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన సాధారణ సమావేశంలో, బడ్జెట్ సమావేశం నిర్వహించారు. గత బడ్జెట్‌లో గడపగడపకూ కార్యక్రమంలో పెట్టిన పనులపై సభ్యులు అడిగారు. ప్రస్తుతం బడ్జెట్‌పై ఆదాయ వనరులపై ప్రశ్నించారు. ఫాగింగ్ చేయించాలని సభ్యులు కోరారు. గడపగడపకూ కార్యక్రమం రద్దైందని ఆ నిధులు లేవని కమిషనర్ శేషఫణి తెలిపారు. డీఎంఎఫ్, తదితర నిధులతో ప్రస్తుతం రూ.3కోట్లకు పైబడి పనుల టెండర్లు పిలిచినట్లు తెలిపారు. సభ్యులు కోరిన పనులకు నిధులు రాగానే టెండర్లు పిలిచి పనులు చేయిస్తామన్నారు. ఎర్రగుంట్లలో ఫాగింగ్ చేయించేందుకు సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ ధర్నా

బద్వేలు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని గురువారం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు కె. నాగేంద్రబాబు మాట్లాడుతూ వైసీపీ హయాంలో పనికి సమాన వేతనం, ఔట్ సోర్సింగ్ కార్మికుల పర్మినెంట్, ఇతర హామీల అమలు కోసం దీర్ఘ కాలిక పోరాటాలు నిర్వహించి అప్పట్లో అక్రమ కేసులు ఎదుర్కొని ఆందోళనలు చేపట్టామన్నారు. 17 రోజులు సమ్మె నిర్వహించిన సందర్భంగా వైసీపీ ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాటి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కార్మికులను మోసం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వమైనా కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు దృష్టిపెట్టాలన్నారు. మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని, యూనియన్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు శ్యామ్ ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

31లోపు ఫసల్ బీమా చెల్లించండి : ఏడీఏ

● రబీలో మంచి దిగుబడులకు సూచనలు

ఎర్రగుంట్ల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రబీ పంటకు సంబంధించి ఫసల్ బీమా ప్రీమియం 31 లోపు చెల్లించాలని ఏడీఏ నరసింహారెడ్డి రైతులను కోరారు. మాలేపాడు గ్రామంలో ఏఓ శ్రీకాంత్‌రెడ్డి, వ్యవసాయ సహాయకులతో నిర్వహించిన పొలం పిలుస్తోందిలో ఆయన మాట్లాడుతూ సెనగ, మినుము, వేరుశనగ, నువ్వులు, వరి పంటలకు ఫసల్ బీమాకు ప్రీమియం సీఎస్‌సీ సెంటర్లలో 1బీ, ఆధార్, బ్యాంక్ ఖాతా జిరాక్స్ పంట ధృవీకరణ పత్రాలను వ్యవసాయ సహాయకుల ద్వారా తీసుకుని చెల్లించవచ్చన్నారు. మినుము పంటలో రసం పీల్చు పురుగుల నిరారణకు పసుపు, నీలం రంగు పల్లాలు ఎకరాకు 15చొప్పున అమర్చుకోవాలని తెలిపారు. శనగ పంటలో ఎండు తెగులు నివారణకు 2ఎంఎల్ /లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు.

వారాహి సూపర్‌స్పెషాలిటీ చిల్డ్రన్స్ ఆస్పత్రిలో అధునాతన వైద్యసేవలు



చిన్నారికి అధునాతన పరికరాలతో అందిస్తున్న వైద్యసేవలు

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోసిన కాంపౌండ్‌లోని వారాహి సూపర్‌స్పెషాలిటీ చిల్డ్రన్స్ ఆస్పత్రిలో అత్యంత అధునాతన పరికరాలతో వైద్యసేవలు అందిస్తున్నట్లు డాక్టర్ వీసీ లోకేష్‌కుమార్, డాక్టర్ పి.శృతి తెలిపారు. తమ ఆస్పత్రిలో కర్నూలు, హైదరాబాదు వంటి మహానగరాల్లో అందించే వైద్యాన్ని తక్కువ ఖర్చుతో పట్టణ ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఇటీవల ముద్దనూరుకు చెందిన గీతా, మహేష్ దంపతుల కుమారుడు పుట్టిన వెంటనే ఏడవకపోవడం, ఛాతిలో నెమ్ము వంటి సమస్యలతో తమను సంప్రదిస్తే పది రోజులు అధునాతన వైద్యపరికరాలతో చికిత్స చేసి ఆరోగ్యంగా తీర్చిదిద్దామన్నారు. ప్రజలకు అన్నివిధాలా మెరుగైన వైద్యం అందిస్తామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


స్వచ్ఛ బద్వేలుకు సహకరించాలి

బద్వేలు, డిసెంబరు26 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ బద్వేలు కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం సీఎంఎం, సీఓ, ఆర్‌పీలతో సమీక్షించిన ఆయన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మున్సిపాలిటీలో మొక్కలు నాటేందుకు వీలున్న ప్రతిచోటా మొక్కలు నాటేలా సహకరించాలని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ మొక్కల ఆవశ్యకతను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఫారెస్టు సిబ్బంది సహకారంతో మొక్కలు నాటేందుకు పురపాలక, సచివాలయ సిబ్బంది సహకారం అందిస్తారన్నారు. ఇంటినిర్మాణాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించేలా చూడాలని, పన్ను బకాయిదారులు నెలాఖరులోపు పన్ను చెల్లించేలా తెలియజేయాలని తదితర సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ, రెవెన్యూ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో వంగవీటి వర్ధంతి

పోరుమామిళ్ల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వంగవీటి మోహనరంగ వర్ధంతి పోరుమామిళ్లలో ఘనంగా జరిగాయి. గురువారం రాయలసేవ సమితి ఆధ్వంలో ఆయన వర్ధంతి కార్యక్రమంలో పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు శీలంశెట్టి లక్షుమయ్య, నీటిసంఘం చైర్మన్ తోట వెంకటయ్య, చెన్ను రమణ, తమ్మిశెట్టి రమణయ్య, నగరి రమణయ్య, బాలచంద్ర, గాజుల వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా నాగేంద్ర



పోరుమామిళ్ల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల బీజేపీ అధ్యక్షుడిగా నాగేంద్రను ఎన్నుకున్నారు. గురువారం పోరుమామిళ్లలో బీజేపీ మండల కమిటీ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి ఆదేశాల మేరకు కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో ఉట్టి శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి, బొమ్మన విజయ్, అసెంబ్లీ కోకన్వీనరు పల్లెంశెట్టి పండరి, షకీలా బేగం, తిప్పలూరు రామసుబ్బారెడ్డి, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ స్ఫూర్తికి వందేళ్లు

శత వసంతంలోకి అడుగిడిన సీపీఐ ● బ్రిటీషు వారికి వ్యతిరేకంగా పోరాడిన మొదటి పార్టీ

జమ్మలమడుగులో ఎద్దుల ఈశ్వరరెడ్డికి ఘన నివాళులు



జమ్మలమడుగులో ఎద్దుల ఈశ్వరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు
ఎర్రగుంట్లలో జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం - పోరుమామిళ్లలో అన్నదానం చేస్తున్న సీపీఐ నేతలు

జమ్మలమడుగు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉద్యమ స్ఫూర్తి చాటుతున్న సీపీఐ ఆవిర్భవించి శత వసంతంలోకి అడుగిడింది. ఈమేరకు స్థానిక పాత బస్టాండులో గురువారం ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి విగ్రహానికి సీపీఐ నేతలు నివాళులర్పించారు. సీపీఐ కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ భారత గడ్డపై సీపీఐ పుట్టి వందేళ్లలోకి అడుగు పెట్టిందన్నారు. 1925 డిసెంబరు 26న కాన్పూర్‌లో ఆవిర్భవించి 2024 డిసెంబరు 26 నాటికి 99 ఏళ్లు పూర్తి చేసుకుని వందో సంవత్సరంలోకి అడుగు పెట్టిందన్నారు. బ్రిటీషు వారికి వ్యతిరేకంగా భారత దేశంలో సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని పిలుపు నిచ్చిన ఏకైక పార్టీ అన్నారు. దేశంలో వందేళ్ల చరిత్ర కలిగిన పార్టీలు కాంగ్రెస్, సీపీఐ మాత్రమేనన్నారు. ఈ సందర్భంగా శత జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించినట్లు ఆయన తెలిపారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న అనేక మంది త్యాగాలు చేశారని, జైలుకెళ్లారని ప్రాణాలు సైతం లెక్క చేయకుండా దేశానికి అర్పించారన్నారు. స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తింపబడ్డారన్నారు. నిర్బంధాలను, నిషేధాలను, అరెస్టుల నుంచి ఎన్నో పోరాటాలు చేసి పార్టీకోసం ఎద్దుల ఈశ్వరరెడ్డి కృషి చేశారన్నారు. డిసెంబరు 28న శతవార్షికోత్సవం పురస్కరించుకుని బహిరంగ సభకు ప్రజలు తరలి రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు దండు రవి, లక్ష్మినారాయణ, మధు, వెంకటరమణ, గురుస్వామి, లాల్‌బాష, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

కొండాపురంలో....

కొండాపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీపీఐ ఉద్యమ స్ఫూర్తితో పుట్టిన పార్టీ అని మండల కార్యదర్శి మనోహర్‌బాబు తెలిపారు. స్థానిక బైపాస్‌రోడ్డులో పార్టీ జెండా ఎగురవేసి కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆకలి కన్నీళ్లు, దోపిడీ లేని సమసమాజం కోసం నిరంతరం పోరాడుతూనే ఉందన్నారు. అనేక సవాళ్లను ఎదుర్కొని పార్టీ నిరుపేదల ప్రతినిధిగా శతవసంతాల మైలురాయిని చేరుకుందన్నారు. సీపీఐ, ఏఐటీ యూసీ నేతలు రమణ, సుబ్బారావు, జయంతు, వైవీ సుదర్శన్‌రెడ్డి, తారాదేవి, జయమ్మ, రాధమ్మ పాల్గొన్నారు.

కలసపాడులో...

కలసపాడు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్లలోకి అడుగిడిన సందర్భంగా వేడుకలు జరిపారు. మండల కార్యదర్శి సునీల్‌కుమార్ మాట్లాడుతూ సీపీఐ అనేక సమస్యలపై పోరాడి విజయం సాధించిందన్నారు. కార్మికుల, కర్షకులు, రైతుల కోసం అలుపెరగని పోరాటాలు చేసి విజయాలు సాధించిందన్నారు. మహ్మద్‌బాషా, చిన్నప్ప, అబ్రహం, సుబ్బయ్య, మౌలాలి, రమణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో....

పోరుమామిళ్ల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీపీఐ వందేళ్ల వేడుకలు చేసుకున్నారు. శత జయంత్యుత్సవాలను జిల్లా కార్యవర్గసభ్యులు వీరశేఖర్, ఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మహాత్మాగాంధీ విగ్రహం వద్ద తిరుపతి రెడ్డి కాలనీలో సీపీఐ జెండాను ఆవిష్కరించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు కేశవ, రవికుమార్, ఫిరోజ్, షాహిదా, బాషా పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో ...

ఎర్రగుంట్ల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీపీఐ శత జయంతి వేడుకల్లో భాగంగా ఎర్రగుంట్లలో పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు ఓబుళరెడ్డి, ఎంవీసుబ్బారెడ్డి, మంజుల, చాంద్‌బాషా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠంలో...

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆవిర్భవించి 99 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రభుత్వ సముదాయ కార్యాలయాల వద్ద సీపీఐ సీనియర్ నేత సోమిరెడ్డిపల్లె నారాయణ జెండా ఆవిష్కరించారు. మండల కార్యదర్శి ఉద యనాథ్, సీనియర్ నేతలు నారాయణ, ప్రభాకర్ నేతలు దేవదాను, విజయచంద్ర, చందు, రవి, ఈశ్వరయ్య మల్లేశ్, సంపత్, మహేశ్ పాల్గొన్నారు.

బద్వేలులో...

బద్వేలు, డిసెంబరు26 (ఆంధ్రజ్యోతి): సీపీఐ శత జయంతిని పురస్కరించుకుని జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరశేఖర్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. పట్టణ కార్యదర్శి బాలు, ఏరియా కార్యవర్గ సభ్యులు వెంకటరమణ, విజయమ్మ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో...

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీపీఐ శతజయంతి ఉత్సవాలను నిర్వహించారు. గురువారం మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీరోడ్డు, హోమస్‌పేట, శివాలయం రోడ్డు మీదుగా పుట్టపర్తి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. పుట్టపర్తి సెంటర్‌లో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన జిల్లా కార్యవర్గ సభ్యుడు రామయ్య మాట్లాడుతూ పార్టీ ఎన్నో హక్కులను సాధించిందన్నారు.

భూ రీసర్వేని రద్దు చేయండి

రెవెన్యూ సదస్సులో రైతుల డిమాండ్ ● మూడెకరాల్లో 50సెంట్లు తక్కువ చేశారని మండిపాటు
సర్వే స్థానంలో ఎల్పీ తేవడంపై తీవ్ర ఆగ్రహం ● మా భూములు అమ్మేందుకు, కొనేందుకు లేదు



భూ సర్వేని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్న రైతులు

ఎర్రగుంట్ల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): 'వైసీపీ ప్రభుత్వం చేపట్టిన భూ రీసర్వే తప్పుల తడక, దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే దీన్ని రద్దుచేసి పాత విధానాన్ని అమలు చేయాలని' హనుమనగుత్తి, బిస్మిల్లాబాదు రైతులు డిమాండ్ చేశారు. గురువారం హనుమనగుత్తి రెవెన్యూ సదస్సులో అధికారుల తీరు, వైసీపీ ప్రభుత్వం అనుసరించిన విధానంపై రైతులు కశిరెడ్డి భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, పుల్లారెడ్డి, సి.రామ్మోహన్‌రెడ్డి, అయ్యవారు రెడ్డి, కశిరెడ్డినారపరెడ్డి, శ్రీదేవి, చంద్రశేఖర్‌రెడ్డి తదితర రైతులు మండిపడ్డారు. భూ రీసర్వే అమలు చేసిన విధానంపై తీవ్ర స్థాయిలో రైతులు ఆగ్రహించారు. రీసర్వే తప్పుల తడక అని, రైతులకు తెలియకుండా ఎవరినీ భూముల వద్దకు పిలవకుండా ఈ సర్వే నిహించారన్నారు. ఇష్టానుసారంగా సరిహద్దు రాళ్లను పాతారన్నారు. ఆన్‌లైన్‌లో అన్ని తప్పులేఉన్నాయన్నారు. ఒక్కో రైతు భూమి విస్తీర్ణంలో 50 నుంచి 60సెంట్లు తక్కువ వచ్చిందన్నారు. ఇందుకోసం రెవెన్యూ అధికారుల చుట్టూ తిరగలేకపోతున్నామని ఎన్నిసార్లు వచ్చినా సమస్య పరిష్కరించడం లేదని విమర్శించారు. ఈ రీసర్వే తప్పులను సరిచేసి ఎవరి భూములు వారికి గత సర్వే నెంబర్లతో పాస్‌బుక్కుల్లో ఎక్కించాలన్నారు. సర్వే నెంబర్లను మార్చి వాటి స్థానంలో ఎల్పీ నెంబర్స్ పెట్టడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఎల్పీ నెంబర్లలో ఒకరికంటే ఎక్కువ మంది రైతులున్నారని, ఫలితంగా రైతులు తమ భూములను కొనడం, అమ్మడం చేయలేకపోతున్నామన్నారు. రీసర్వే విధానాన్ని పూర్తిగా రద్దుచేసి పూర్వ విధానాన్ని అమలు చేసి తమకు న్యాయం చేయాలని అధికారులను కోరారు. రీసర్వే విధానాన్ని రద్దు చేసే అధికారం మాకు లేదని, తప్పులుంటే సరిచేస్తామని తహసీల్దార్ శోభన్ బాబు తెలిపారు. నాలుగు తరాల ఆస్తులున్నాయని వాటికెలా ఆధారాలు చూపించాలని రైతులు ప్రశ్నించారు. తాతల నాటి భూములను వంశపారంపర్యంగా తమకు వస్తున్నాయని వాటిపై తమకు పూర్తి హక్కులున్నాయని చాలా వాటిని ఆన్‌లైన్‌లో కూడా ఎక్కించామన్నారు. అయితే మళ్లీ ఆధారాలంటే ఎలా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడికొచ్చిన రైతులంతా సర్వే నంబర్లను రద్దుచేసి వాటిస్థానంలో ఇచ్చిన ఎల్పీ నెంబర్లతో వచ్చే సమస్యలపైనే అధికారులకు వినతి పత్రాలు ఇచ్చారు.

సర్వే స్థానే ఎల్పీ నెంబర్లు

పాత సర్వే నెంబర్లతో పనిలేదని ఇకపై సర్వే నెంబర్ల స్థానంలో ఎల్పీ నెంబర్లతో అన్నీ నడుస్తాయని సర్వేయర్ వివరించారు. అయితే ఎల్పీ నంబర్స్‌లో ఎక్కువ మంది రైతులు ఉంటారని, వారంతా కలిసి చలానా కట్టి వాటిని విడదీసుకోవచ్చన్నారు. కలిసి రాకపోతే ఒక్కరు చలానా కట్టినా వారికే విడదీస్తామన్నారు. ఎల్పీ విధానాన్ని అమలు చేస్తున్నా రైతులకు మాత్రం పాత సర్వేనెంబర్లతో కూడిన అడంగళ్లనే వీఆర్‌ఓలు రైతులకు సదస్సుల్లో ఇవ్వడం గమనార్హం. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అడంగళ్లు, 1బీలు సక్రమంగా రాకపోవడంతో ఇన్సూరెన్సు కట్టేందుకు, బ్యాంకుల్లో లోన్లు తీసుకునేందుకు చా లా కష్టంగా మారిందన్నారు. వీఆర్‌ఓలు జారీచేసిన పత్రాలపై సంతకాలు చేయించుకుని ఇన్సూరెన్సు కట్టామని రైతులు వాపోయారు. మా భూమిపై మా హక్కులేదా అంటూ రైతులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నరసింహపురంలో ఉన్న పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వాతి నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం తెల్లవారు జామున లక్ష్మీనరసింహస్వామి, ఆంజనేయస్వామి మూలవిరాట్టులకు పంచామృతాభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. పూజలు అనంతరం పట్టువస్త్రాలు, వెండి కవచాలు, పుష్పాలను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు అన్నప్రసాదం చేశారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి

బద్వేలు రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆధార్ క్యాంపు ద్వారా సవరణలు వంటి సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మల్లీశ్వరి కోరారు. వీరపల్లె పంచాయతీ వెంకటాద్రినగర్ ఎస్టీకాలనీ అంగన్వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించిన ఆధార్ క్యాంపును ఆమె పరిశీలించారు. ప్రజలు గ్రామానికి వచ్చే రహదారిలో రోడ్డుకు ఇరువైపులా ముళ్ల పొదలు పెరిగాయని ఆమె దృష్టికి తీసుకురాగా, పంచాయతీ కార్యదర్శి మాట్లాడి ముళ్ల పొదలను తొలగించాలని ఆదేశించారు. ఇందుకు ప్రజలు కూడా సహకారం అందించాలని కోరారు. గ్రామంలో జాబ్‌కార్డులు లేని వారికి వెంటనే కొత్త జాబ్ కార్డులు మంజూరయ్యేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ

జమ్మలమడుగు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అంగన్వాడీ కార్యకర్తలకు పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం అందజేస్తున్న పుస్తకాలు, ఆహార పదార్థాలకు సంబంధించి సూపర్‌వైజర్ గౌసియా శిక్షణ నిర్వహించారు. అనంతరం ప్రాజెక్టు పరిధిలో పి-1, పి-2 పుస్తకాలను పంపిణీ చేశారు. అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సదస్సులో 24 ఫిర్యాదులు

ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బొల్లవరం రెవెన్యూ సదస్సులో 24 ఫిర్యాదులు అందాయి. బొల్లవరం హరిజనవాడలో సచివాలయం-1లో రెవెన్యూ సదస్సును రీసర్వే డిప్యూటీ తహసీల్దారు సుదర్శన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో 1బి ఖాతాలో సవరణలకు 19, నిషేధిత భూముల జాబితా నుంచి తొలగింపుపై నాలుగు అభ్యర్థనలు, ఇతర సమస్యలపై విన్నవించుకున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

జమ్మలమడుగు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గురువారం సాయంత్రం నిరసన వ్యక్తం చేశారు. స్థానిక పాత బస్టాండులోని మస్టర్‌పాయింట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ నేతలు విజయ్, ఓబన్న, తిరుపాలమ్మ, పుల్లమ్మ, సుబ్బరాయుడు, ప్రభాకర్, విజయ్, చంటి, సుధీర్, యేసుదాసు పాల్గొన్నారు.

'బొగ్గు సరఫరాలో భారీ కుంభకోణం'

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జెన్‌కోకు బొగ్గు సరఫరాలో రూ.1000 కోట్ల భారీ కుంభకోణం జరిగిందని రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కుంచెం వెంకటసుబ్బారెడ్డి సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. దీనిపై సీబీఐ, సీఐడీతో విచారణ జరపాలని కోరారు. కృష్ణపట్నం థర్మల్ పవర్‌ప్లాంట్‌కు బొగ్గు సరఫరా కాంట్రాక్టును వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయ్‌సాయిరెడ్డి బంధువులకు చెందిన అరబిందో అనుబంధ సంస్థ ట్రిడెంట్ నాలెడ్జ్ కంపెనీకి అప్పగించారన్నారు. ఆ సంస్థ టన్ను రూ.8,500లతో 4.5 లక్షల టన్నుల నాశిరకం బొగ్గును సరఫరా చేసిందన్నారు.

సీఐ ఆధ్వర్యంలో గుంతలు పూడ్చివేత



గుంతలు పూడ్చి నీటిని మళ్లిస్తున్న దృశ్యం

పోరుమామిళ్ల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వర్షానికి రహదారుల న్నీ గుంతలుగా ఏర్పడి నీరు నిల్వ ఉండడంతో సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి ఆధ్వర్యంలో గుంతలు పూడ్చి వర్షం నీరు మళ్లించే కార్యక్రమం చేపట్టారు. గురువారం సాయిబాబా దేవాలయం వద్ద వర్షంనీరు నిల్వ ఉండడంతో ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. విషయం తెలుసుకున్న సీఐ గుంతలను పూడ్చి నీటిని మళ్లించే కార్యక్రమాలు చేశారు.

డిస్ట్రిబ్యూటరీ చైర్మన్‌కు ఘన సన్మానం



డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ ధనిరెడ్డి రామచంద్రారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

రాజుపాలెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేసీకెనాల్ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ ధనిరెడ్డి రామచంద్రారెడ్డిని విద్యుత్ మీటరు రీడరు అసోసియేషన్ సన్మానించింది. గురువారం కొరపాడులోని తన నివాసం వద్ద ప్రొద్దుటూరు, రాజుపాలెం మండలాల దాదాపు 35 మంది విద్యుత్ మీటరు రీడర్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో మీటరు రీడరు సూపర్‌వైజరు నాగరత్నాచారి, అధ్యక్షులు డక్క ఓబులేసు, శ్రీనివాసులు, కిరణ్‌కుమార్, సుబ్బయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి మెగా జాబ్‌మేళా

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి శుక్రవారం నుంచి మూడు రోజులు జ్యోతి ఫుడ్స్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ జక్కా పెద్దన్న తెలిపారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ సీమ యువతకు జ్యోతి ఫుడ్స్ ఆహార పరిశ్రమను గోపవరంలో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మీదుగా శుక్రవారం సంస్థ లోగోను ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.

భూసమస్యలకు శాశ్వత పరిష్కారం

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులతోనే భూసమస్యలకు శాశ్వత పరిష్కారం అని మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మల్లేపల్లె పంచాయతీలో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు భూసమస్యలను తీసుకువస్తే తహసీల్దారు సమక్షంలో పరిష్కరిస్తామన్నారు. సర్పంచ్ చిలమల నారాయణ, తహ సీల్దారు దామోదర్‌రెడ్డి, రీసర్వే తహసీల్దారు సాంబశివారెడ్డి, టీడీపీ నేతలు మేకల సుధాకర్, గంగరాజు, చిలమల నాగయ్య, ఈశ్వర్‌రెడ్డి, గంగరాజు, మస్తాన్ యాదవ్ పాల్గొన్నారు.



మండలంలో పశువైద్యం అందక ఇక్కట్లు



సీతారాంపురంలో మూతపడిన పశువైద్యశాల

చాపాడు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలం పాడిపరిశ్రమలకు ప్రసిద్ధి. కేసీకెనాల్, చాపాడు చానెల్ కింద రైతులు ఏటా సుమారు 26 వేల ఎకరాల్లో వరిపైరు సాగు చేస్తారు. పంటలు ఉండడంతో పాడిపరిశ్రమ ప్రతి ఇంట్లో వెలుగొందుతోంది. ఇలాంటి మండలంలో పశువులకు వైద్యం చేసేందుకు సరైన సౌకర్యాలు లేవు. 30 ఏళ్ల కిందట ప్రభుత్వ పశువైద్యశాలలు నిర్మించడంతో పూర్తిగా దెబ్బతిన్నాయి. ఏళ్లు గడుస్తున్నా కొత్త భవనాలు నిర్మించలేదు. మండలంలో ప్రధాన పశువైద్యశాలలు చాపాడు, చిన్నగురవలూరు, వెదురూరు గ్రామాల్లో ఉన్నాయి. సబ్‌సెంటర్లు పల్లవోలు, సీతారాంపురం, అన్నవరం, చియ్యపాడు, అనంతపురం, సోమాపురం, లక్ష్మీపేట గ్రామాల్లో ఉన్నాయి. వీటిలో అన్నవరం, లక్ష్మీపేట, అనంతపురం గ్రామాలు తప్ప మిగిలిన గ్రామాల్లో భవనాలు ఎందుకూ పనికిరాకుండా పోయాయి. కొన్ని చోట్ల వర్షానికి మందులు తడుస్తున్నాయని సిబ్బంది తెలిపారు. పనికిరాని పశువైద్యశాల భవనాలు మూతపడ్డాయి. మండలంలో మొత్తం 12 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రెండేళ్ల నుంచి వెదురూరులో పశువైద్య అధికారి లేక రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు. లైవ్‌స్టాక్ అసిస్టెంట్ల పోస్టులు 3, అటెండర్ పోస్టులు 7, వీఏ పోస్టు ఒకటి ఖాళీగా ఉన్నాయి. సిబ్బంది కొరత ఎక్కువగా ఉన్నందున మూగజీవాలకు ప్రస్తుత సిబ్బంది వైద్య సేవలు అందించాలంటే కష్టంగా ఉంది. మండలంలో మొత్తం సుమారు 20 వేల మేకలు, 2,800 ఆవులు, 27 వేల గొర్రెలు, మేకలు ఉన్నాయి. మూగజీవాలకు గాలికుంటు, పారుడు రోగం, నీలికాలుక వంటివి వస్తుంటాయి. పెద్ద మొత్తంలో జీవాలు ఉన్నందున వాటికి వైద్యసేవలు అందించాలంటే సిబ్బంది చాలా ఇబ్బంది పడుతున్నారు. మండలంలో ఇద్దరు గోపాలమిత్రలు పనిచేస్తున్నారు. ఏళ్లగా కొత్త భవనాలు నిర్మించాలని, సిబ్బందిని భర్తీ చేయాలని కోరుతున్నా ఎవరూ పట్టించుకోలేదని రైతులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.